తెలుగుదేశం పార్టీ మహిళల సాధికారతకు ఎప్పుడూ అండగా నిలిచింది. "స్త్రీశక్తి" నినాదంతో మహానాడు-2026 నిర్వహించడం గర్వకారణం. మహిళా, యువ, రైతు సంక్షేమంతో రాష్ట్రాభివృద్ధి దిశగా పార్టీ ముందుకు సాగుతోంది. మహానాడు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక వేదిక.



ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ


బుధవారం 27.05.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 35 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00



# రైతన్నకు అండగా 'ఫార్మ్ టు హోమ్'

- రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకు !
- వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌పై కొత్త వ్యూహం
- దేవరపల్లి మండలం యడవోలు వద్ద కోకో సిటీ
- జూలైలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన
- పులివెందులలో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ పూర్తికి నిధుల మంజూరు
- కొత్త ఆక్వా కనెక్షన్లకూ విద్యుత్ సబ్సిడీ వర్తింపు
- మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్ల కొనుగోలుకు ఆమోదం
- వ్యవసాయ అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకు చేర్చేలా ఫార్మ్ టూ హోమ్ విధానం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా తక్కువ వ్యయంతో ఇంటి వద్దకే చేరేలా ఈ కొత్త వ్యూహం ఉపయోగపడుతుందని అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం వ్యవసాయం, ఇతర అనుబంధ శాఖలు, ప్రాథమిక రంగంలో 6 మిషన్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈసారి రాష్ట్రంపై ఎల్ నినో చూపుతున్న ప్రభావాలను అంచనా వేస్తూ ప్రాంతాల వారీగా పంటల సాగు అంచనా జరగాలని, దానికి అనుగుణంగానే చర్యలు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పీఎండీఎస్- హాఫ్ మూన్ విధానాల్లో సేద్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని రైతులు నష్టపోకుండా పంటలకు కనీస మద్ధతు ధర లభించేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో కేంద్ర సహకారం కూడా తీసుకుని ఏపీలో చేపడుతున్న ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సాగుతో విజయవంతమైన రైతుల సేవల్ని కూడా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. కరవు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పశువుల దాణా పండించేలా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఆధునీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి ఏ పంటకు భూములు అనువుగా ఉన్నాయన్నది రైతులకు తెలియచేయాలన్నారు. భూసార పరీక్షలు చేసి వాటి వివరాలను రైతులు పొందేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రకృతి సేద్యం సహా ఎన్ఎంఎన్ఎఫ్ పథకం అమలు కోసం కేంద్రానికి లేఖలు రాయాలని సీఎం నిర్దేశించారు. రైతు బజార్లు, ప్రైవేటు మార్కెట్లలో ప్రకృతి సేద్యం ద్వారా పండిన ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**అరటికి కోల్డ్ స్టోరేజ్ సౌకర్యం :** కృష్ణా, గోదావరి డెల్టా సహా వివిధ ప్రాంతాల్లో పంటలకు సాగునీటిపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. పంట తెగుళ్లను నియంత్రించేలా పురుగుమందుల వినియోగం ఏమేరకు రాష్ట్రంలో తగ్గించగలిగామో అంచనా వేయాలని సీఎం స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మైక్రో న్యూట్రియంట్లను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధ ప్రభావం నేపథ్యంలో రసాయన ఎరువుల లభ్యత పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ప్రకృతి సేద్యం వైపుగా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు. మిగతా 2లో...







# హైబ్రిడ్ మహానాడుకు టీడీపీ సర్వం సిద్ధం

- స్త్రీ శక్తిని చాటేలా మహానాడు-2026
- 2029 ఎన్నికలకు మహానాడులో రోడ్ మ్యాప్
- కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న టీడీపీ అధినేత చంద్రబాబు
- వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో మహానాడుకు నారా లోకేష్
- ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా వర్చువల్‌గా మహానాడు
- పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కార్యవర్గాలు
- క్లస్టర్ల వారీగా వర్చువల్‌గా మహానాడులో పాల్గొననున్న శ్రేణులు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** మహానాడు... ఈ పేరు చెబితేనే తెలుగు ప్రజల్లో, తెలుగుదేశం పార్టీలో ఓ వైబ్రేషన్ పుడుతుంది. తెలుగుదేశం పార్టీ మహానాడును ఓ కార్యక్రమంలా కాకుండా... ఓ పండుగలా చేస్తుంది. అందుకే ఎన్టీఆర్ హయాం నుంచి మహానాడుకు.. మహానాడు కార్యక్రమాలకు అంతటి ప్రాధాన్యత.. ప్రాముఖ్యత ఏర్పడింది. 44 ఏళ్ల తెలుగుదేశం పార్టీ చరిత్రలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంది... ఎత్తుపల్లాలు చూసింది. మహానాడులో గతాన్ని ఓసారి నెమరు వేసుకోవడం.. తాజా పరిస్థితులపై చర్చించుకోడం.. భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం అనేది టీడీపీలో అనాదిగా వస్తున్న ఆనవాయితీ. మహానాడు వేదికగా తీసుకున్న నిర్ణయాలు ఇటు పార్టీనే కాకుండా.. రాష్ట్రాన్ని ప్రభావితం చేసిన సందర్భాలు ఉన్నాయి. మహానాడు ఈ స్థాయిలో ప్రభావం చూపుతుంది కాబట్టే... మహానాడులో ఏం చర్చిస్తారు... ఏం మాట్లాడతారు.. ఏయే అంశాలు ప్రస్తావనకు వస్తాయనేది ఇటు సామాన్య వర్గాల్లోనూ... అటు రాజకీయ, పరిపాలనా వర్గాల్లోనూ ఆసక్తి నెలకొంటోంది. ఈ క్రమంలో మిగతా 2లో...


# గోదావరిని కలుషితం చేస్తే ఉపేక్షించం!



- కలుషిత జలాలు గోదావరిలో కలిపేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారు?
- గలగలా గోదారి... అని గీతం ఆలపిస్తాము... ఇంత కాలుష్యం ఉంటే ఏమని ఆలపించాలి?
- ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యానికి నోటీసులు ఎందుకు ఇవ్వలేదు?
- రూ. 13 కోట్ల బకాయిలను రాబట్టలేరా?
- ప్రజల ముందు సమాధానం చెప్పాల్సింది మేము
- పుష్కరాల్లో పన్నీరు స్నానం చేయించక్కర్లేదు... కెమికల్ స్నానం చేయించకూడదు కదా

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'మా తెలుగుతల్లికి.. రాష్ట్రగీతంలో గల గలా గోదారి అని గుండెల నిండా ఆర్తితో ఆలపిస్తాం.. ఇక్కడకు వచ్చి చూస్తే గోదావరి వెలవెలబోతూ.. కాలుష్యంతో నిండిపోతూ కనిపిస్తోంది. ఏమని ఆలపించాలి. ఇంతటి కాలుష్యం కలుస్తున్న నీటిలో మన పిల్లలను స్నానం చేయించే సాహసం చేస్తామా..? ఇంత దారుణంగా కలుషిత జలాలు గోదావరిలోకి ప్రత్యక్షంగా కలుస్తున్నా అధికారులు ఇంకా మీనమేషాలు ఎందుకు లెక్కిస్తున్నారు?' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది... పరిశ్రమలను ప్రోత్సహించాలని మిగతా 2లో...

## డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత



- మెగా డీఎస్సీ-2025పై దుష్ప్రచారం చేస్తే క్రిమినల్ కేసులు
- పాఠశాల విద్యాశాఖ తీవ్ర హెచ్చరిక
- 15941 పోస్టుల భర్తీ 100% పారదర్శకం..
- నిరాధార ఆరోపణలు చేసినవారిపై పరువు నష్టం నోటీసులు, కేసులు నమోదు!

మిగతా 3లో...

# ద్వాక్రా మహిళలకు ప్రధాని మోదీ వరం

## పూచికత్తు లేకుండా రూ.10లక్షల వరకు రుణాలు

- కేంద్ర నిర్ణయంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హర్షం



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్‌లోని డ్వాక్రా మహిళల ఆర్థిక స్వావలంబనకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. 'దీన్ దయాళ్ అంత్యోదయ యోజన' (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం) పథకం కింద మహిళలకు ఎలాంటి పూచీకత్తు లేకుండా గరిష్ఠంగా రూ. 10 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు అందించే అవకాశాన్ని కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దీన్ దయాళ్ అంత్యోదయ యోజన గ్రామీణ, పట్టణ పేదలకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మహిళల ఆర్థిక స్థితిని మెరుగుపరచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన పథకమని తెలిపారు. పేదరిక నిర్మూలన, స్వావలంబన బలోపేతమే ఈ నిర్ణయానికి ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 90 లక్షలకుపైగా మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, మిగతా 2లో...

# వైద్య సేవల్లో ఏఐకు ఏపీ దిక్సూచి





3లో

- ఏఐ వినియోగం ద్వారా తక్కువ వ్యయంతో నాణ్యమైన వైద్య సేవలు!
- వ్యాధుల భారాన్ని తగ్గించడంలో 'ఏఐ'దే కీలకపాత్ర!
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

## 'లేపాక్షి' ఉద్యోగులకు తీపి కబురు

- జీతాల పెంపుదలకు మంత్రి సవిత పచ్చ జెండా
- మూల వేతనంపై 10 శాతానికి పైగా పెంపు
- అమ్మకాలు పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులకు బోనాంజా
- ఉద్యోగుల హర్షాతిరేకాలు
- సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కు, మంత్రి సవితకు ధన్యవాదాలు

2

## అక్టోబర్ నాటికి అన్ని సబ్‌స్టేషన్లు పూర్తి

- అధిక ఉష్ణోగ్రతలు, సాంకేతిక కారణాలతోనే విద్యుత్ అంతరాయాలు
- రాష్ట్ర వినియోగానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది
- అనుమతులు లేని హోర్డింగ్ లతో విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం
- సమస్యల సత్వర పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 1912
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

## అక్రమ వలసలపై కేంద్రం కీలక నిర్ణయం

- జనాభా మార్పుల అధ్యయనానికి ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు
- దేశ భద్రత, సార్వభౌమత్వానికి చొరబాట్లు ముప్పు: అమిత్ షా

మిగతా 3లో...

## ఎస్ఐఆర్-2026కు రాజకీయ పార్టీల సహకారం అవసరం

- రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటరు జాబితాలను స్వచ్ఛంగా, నిర్దిష్టంగా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)-2026 కార్యక్రమంపై సమగ్రంగా చర్చించారు. మిగతా 3లో...

## 20 వేల క్యూసెక్కులతో ఎనికేపాడు అండర్‌టన్నెల్

- ఎనికేపాడు నుండి కొల్లేరు వరకు బుడమేరు డ్రైన్ పూడికతీత
- 1.80 కోట్లతో వెలగలేరు రెగ్యులేటర్ కు కొత్త గేట్లు అమర్చాం.
- బుడమేరు డ్రైన్ పై ఎనికేపాడు యూటీ పనులను పరిశీలించిన మంత్రి నిమ్మల

3లో



## డ్వాక్రా మహిళలకు ప్రధాని మోదీ వరం ...
## పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల వరకు రుణాలు



(మొదటి పేజీ తరువాయి)

వీరిలో కనీసం 10 లక్షల మంది ఈ పథకం ద్వారా లబ్ధి పొందినా దాదాపు రూ.1 లక్ష కోట్లకు పైగా ఆర్థిక ప్రవాహం గ్రామీణ ఆర్థిక వ్యవస్థలోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

ఈ పథకం ద్వారా గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబనకు మరింత బలం చేకూరుతుందని, మహిళలు స్వయం ఉపాధి రంగంలో ముందడుగు వేయడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు. చిన్న వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు, పాడి పరిశ్రమ, ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు వంటి రంగాల్లో మహిళలు అభివృద్ధి సాధించేందుకు ఈ రుణాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని, డ్వాక్రా మహిళల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు.

## 'లేపాక్షి' ఉద్యోగులకు తీపి కబురు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లో ఉన్న లేపాక్షి షో రూమ్ ల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ప్రస్తుతం అందుతున్న మూల వేతనాలపై అదనంగా పది శాతానికి పైగా జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం లేపాక్షి ఉద్యోగులకు శుభ వార్త తెలిపారు. తాడేపల్లిని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లేపాక్షి షో రూమ్ ల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కలిసి, పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేశారు. గడిచిన రెండేళ్ల నుంచి అమ్మకాలు పెంచినట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మంత్రి సవిత స్పందిస్తూ, లేపాక్షి షో రూమ్ ల్లో 2024-25లో రూ.56.47 కోట్లు, 2025-26లో రూ.60.75 కోట్ల మేర అమ్మకాలు జరపడంపై ఆనందం వ్యక్తంచేస్తూ ఉద్యోగులను అభినందించారు. పెరిగిన అమ్మకాలను దృష్టిలో పెట్టుకుని ఆయా ఉద్యోగుల స్థాయిని బట్టి 10 శాతానికి పైగా జీతాలు పెంచుతున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ రూ.80 కోట్లకు అమ్మకాలు పెంచాలని దిశా నిర్దేశం చేశారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 19 లేపాక్షి షో రూమ్ లు ఉన్నాయన్నారు. త్వరలో రాజమండ్రి ఎయిర్ పోర్టులో నూతన షో రూమ్ ను ఏర్పాటు చేయబోతున్నామన్నారు. అన్ని లేపాక్షి షో రూమ్ లను నేటితరం అభిరుచులకు అనుగుణంగా మరమ్మతులు చేసి అభివృద్ధి చేస్తున్నామన్నారు. హస్త కళాకారులకు ఆర్థిక భరోసా కలిగించేలా 365 రోజులూ ఉపాధి కల్పించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్య సాధనకు బద్ధులై... లేపాక్షి షో రూమ్ ల్లో అమ్మకాలు పెంచే బాధ్యత ఉద్యోగులదేనన్నారు. హస్త కళాకారులతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. పెరిగిన అమ్మకాల నేపథ్యంలో జీతాలు పెంచినట్లు మంత్రి సవిత వెల్లడించారు. జీతాల పెంపుదలపై ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు. సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి సవితకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీహెచ్డీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు బీహెచ్వీఎస్ఎస్ఎన్ రాజు, మహేశ్వరరావు, బాలాజీ, భారతి, చంద్రశేఖర్, సుబ్బరావు, కిషోర్ కుమార్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్ డిటెక్షన్ కిట్లతో గంజాయి ముఠా గుట్టురట్టు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** మాదక ద్రవ్యాల గుర్తింపు కిట్లతో నిర్వహించిన పరీక్షల ద్వారా గంజాయి విక్రయాలు, వినియోగానికి పాల్పడుతున్న ముఠాను దుగ్గిరాల పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఐదుగురు గంజాయి విక్రయదారులు, ఏడుగురు వినియోగదారులు కలిపి మొత్తం 12మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 2.5కేజీల గంజాయి, రూ.2 వేల నగదు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా అనుమానిత వ్యక్తులు, ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చిన డ్రగ్ డిటెక్షన్ కిట్లతో అనుమానితులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇటీవల దుగ్గిరాల పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రగ్ డిటెక్షన్ పరీక్షల్లో ఇద్దరు యువకులకు పాజిటివ్ ఫలితాలు రావడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. వారి సమాచారం మేరకు మంగళగిరి రూరల్ సీఐ ఏ.వి. బ్రహ్మం ఆధ్వర్యంలో దుగ్గిరాల ఎస్సై వెంకట రవి సిబ్బందితో కలిసి విస్తృత తనిఖీలు చేపట్టారు. గంజాయి సరఫరా చేస్తున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారణ జరపగా మొత్తం 12 మంది ఈ ముఠాలో ఉన్నట్లు తేలిందన్నారు.

నిందితులపై దుగ్గిరాల పోలీస్ స్టేషన్లో ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు దుగ్గిరాల గ్రామంలోని కొత్త లాకుల వద్ద నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

పోలీసుల వివరాల ప్రకారం ప్రధాన నిందితుడు ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ ప్రాంతం నుంచి గంజాయి తీసుకొచ్చి మిగతా నిందితులకు సరఫరా చేస్తున్నాడు. వారు దుగ్గిరాల, ఈమని, రేవేంద్రపాడు, తెనాలి పరిసర ప్రాంతాల్లో యువకులకు చిన్న మొత్తాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వినియోగదారులు తరచూ గంజాయి కొనుగోలు చేసి సేవిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.

జిల్లాలో గంజాయి నిర్మూలన కోసం "సంకల్పం -- మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం" కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. గడిచిన ఎనిమిది నెలల్లో జిల్లాలో గంజాయి సంబంధిత 68 కేసులు నమోదు చేసి 395 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. 121.18 కేజీల డ్రై గంజాయి, 1.47 లీటర్ల లిక్విడ్ గంజాయి, 39.33 గ్రాముల ఎండీఎంఏ మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# రైతన్నకు అండగా 'ఫార్మ్ టు హోమ్'

(మొదటి పేజీ తరువాయి)

నేచురల్ ఫార్మింగ్ పై వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సీఎం నిర్దేశించారు. వ్యవసాయ యాంత్రీకరణ పై క్లస్టర్ల వారీగా ప్రణాళికలు చేపట్టటంతో పాటు రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, విత్తన యంత్రాలు, ఇతర పరికరాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫార్మర్ యాప్ ద్వారా అన్ని అంశాలనూ ఇంటిగ్రేట్ చేయాలని డ్రోన్లు, ఫార్మింగ్ యంత్రాల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్ గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో పూర్వోదయ పథకం అమలులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల కనెక్టివిటీ, గోదాములు సహా మౌలిక సదుపాయాల నిర్మాణంతో పాటు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో అభివృద్ధి చేయనున్నట్టు సీఎం వివరించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లి సమీపంలో యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నట్టు సీఎం వెల్లడించారు. పశు దాణాతో పాటు సైలేజ్ ను తక్కువ



వ్యయానికే అందుబాటులోకి తేవటంతో పాటు తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా పౌల్ట్రీలో కోళ్లు చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో అరటికి కోల్డ్ స్టోరేజి సౌకర్యం కల్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

**బ్లూ ఎకానమీగా ఆక్వారంగం అభివృద్ధి :** పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి అవసరమైన రూ.3 కోట్లను తక్షణమే విడుదల చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని సీఎం నిర్దేశించారు. ఆక్వా జోన్లలో ఆక్వా సాగు చేసే రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సీడీ అంశంపైనా ముఖ్యమంత్రి కీలకమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆక్వా రంగానికి యూనిట్ కు రూ.1.50 చొప్పున విద్యుత్ విద్యుత్ సబ్సీడి ఇస్తున్నామని అన్నారు. ఇప్పటికే ఇచ్చిన 50వేల కనెక్షన్లతో పాటు కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకూ ఈ సబ్సిడీ వర్తింప చేయాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్ల ఇస్తోందని తెలిపారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు కూడా రూ.188 కోట్ల అదనపు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రాష్ట్రంలో సాగవుతున్న 4 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఆక్వా రంగంలో క్వాలిటీ సర్టిఫికేషన్ తో పాటు ట్రేసబిలిటీ తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్లోనూ చేపల పెంపకం ద్వారా స్థానిక మత్స్యకారుల ఆదాయం పెరిగేలా చూడాలన్నారు. అలాగే సముద్ర తీరంలో మత్స్యకారులకు 200 మెకనైజ్డ్ బోట్లను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. దీని కోసం రూ.240 కోట్ల మేర వ్యయం అవుతుందని అధికారులు సీఎంకు వివరించారు. బ్లూ ఎకానమీ దిశగా ఆక్వా రంగాన్ని ప్రోత్సహిస్తామని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో రైతు బజార్లను ఆధునికంగా మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో 90 నియోజకవర్గాల్లో రైతు బజార్లను ఏర్పాటు చేసేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. డిజి రైతు బజార్ యాప్ను మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, ఉద్యాన, మత్స్యశాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల అధికారులు, వివిధ కార్పోరేషన్ల చైర్మన్లు హాజరయ్యారు.

# హైబ్రిడ్ మహానాడుకు టీడీపీ సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

2026 మహానాడు బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు జరగనుంది. ఈ రెండు రోజుల మహానాడులో 20 తీర్మానాలు చేపట్టనున్నారు. వీటిల్లో 10 ఏపీ, 4 తెలంగాణ, 1 అండమాన్ కు సంబంధించిన తీర్మానాలు ఉంటాయి. ఇక ఉమ్మడిగా 4 తీర్మానాలతో పాటు... చివరిగా అత్యంత కీలకమైన రాజకీయ తీర్మానం ఉంటుంది.

**చర్చలు... తీర్మానాలు... కార్యాచరణ :** రెండు రోజుల మహానాడులో ఏయే అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టాలనే దానిపై పార్టీలో ఇప్పటికే కసరత్తు జరిగింది. ఈ ఏడాది చేపట్టనున్న మహానాడును స్త్రీ శక్తి థీమ్ తో నిర్వహించాలని ఇప్పటికే నిర్ణయించుకున్న క్రమంలో మహానాడు వేదికగా జరగబోయే ప్రసంగాలు మహిళ శక్తి కేంద్రీకృతంగా ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. వివిధ అంశాలపై చర్చించడం... తీర్మానాలు చేయడం.. ఆయా అంశాలకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేయడం అనే దిశగా రెండు రోజుల మహానాడు జరగనుంది. ఇదే సమయంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 2 ఏళ్లు పూర్తి కావస్తున్నందున్న.. వచ్చే ఎన్నికలకు రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకునే దిశగా టీడీపీ అధినాయకత్వం మహానాడు వేదికగా దిశా నిర్దేశం చేసే సూచనలున్నాయి. దీంతోపాటు స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులను సమాయత్తం చేయనున్నారు. మహానాడు తొలి రోజున టీడీపీ జాతీయ అధ్యక్షులు సీఎం చంద్రబాబు ఉదయం 09.00 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్తారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ కు నివాళులర్పిస్తారు. పార్టీ కోసం ప్రాణాలర్పించిన వారికి నివాళులర్పిస్తారు. అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ప్రారంభ ఉపన్యాసంతో కార్యక్రమం ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత పార్టీ పద్దుల వివరాలను వివరిస్తారు. అనంతరం



కార్యకర్తలను ఉద్దేశించి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తారు. స్త్రీశక్తి, కార్యకర్తే అధినేత, పేదల సేవలో వంటి అంశాలపై నేతల ప్రసంగిస్తారు. వీటిల్లో భాగంగా వివిధ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదిస్తారు. సాయంత్రం 06.00 గంటలకు మొదటి రోజు కార్యక్రమం ముగుస్తుంది. ఇక రెండవ రోజు 28వ తేదీన ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని నివాళులర్పిస్తారు. తెలుగుజాతి విశ్వఖ్యాతి, గతంలో పార్టీ చేసిన పోరాటాలు, అన్నదాతకు అండగా, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించే సాయం, నా దేశం... నా బాధ్యత, ఆధ్యాత్మికాంధ్ర, మౌళిక సదుపాయల కల్పన, శాంతిభద్రతలు, విధ్వంసం నుంచి వికాసం వైపు ప్రయాణం, సంపద సృష్టి వంటి అంశాలపై చర్చించి.. తీర్మానాలను ఆమోదిస్తారు. ఇక చివరిలో రాజకీయ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముగింపు ఉపన్యాసంతో రెండు రోజుల మహానాడు ముగుస్తుంది.

**2026 మహానాడు ప్రత్యేకతలు :** మంత్రి నారా లోకేష్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత జరుగుతోన్న తొలి మహానాడు ఇదే. ఈ నేపథ్యంలో నారా లోకేష్ ఏం ప్రసంగిస్తారు.. ఎలాంటి దిశా నిర్దేశం చేస్తారనే ఆసక్తి అందరిలోనూ కన్పిస్తోంది. ఇక గతానికి భిన్నంగా 2026 మహానాడును నిర్వహిస్తున్నారు. ఇటు ఫిజికల్ గా.. అటు వర్చువల్ పద్ధతిలో మహానాడు జరగనుంది. ముందుగా నెల్లూరులో మహానాడు చేపట్టాలని భావించినా... పశ్చిమాసియా దేశాల్లో యుద్ధం నేపథ్యంలో దేశంలో ఇంధన పొదుపు చర్యలు పాటించాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడంతో నెల్లూరులో మహానాడు చేపట్టాలన్న నిర్ణయంలో మార్పు జరిగింది. మోదీ పిలుపునకు మద్ధతుగా ఇంధన పొదుపు విధానాలను పాటిస్తూ మహానాడు నిర్వహించనున్నారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులతోపాటు.. జాతీయ, రాష్ట్ర కార్యావర్గాలకు చెందిన సభ్యులు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫిజికల్ గా మహానాడులో పాల్గొంటారు. ఈ కమిటీల్లో లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా వారి వారి ప్రాంతాల నుంచి వర్చువల్ పద్ధతిలో మహానాడులో పాల్గొంటారు. వర్చువల్ పద్ధతిలో క్లస్టర్ల వారీగా మహానాడు నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 1,800కు పైగా క్లస్టర్లల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి అక్కడ కూడా పండుగ వాతావరణంలో మహానాడను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

## అక్టోబర్ నాటికి అన్ని సబ్‌స్టేషన్లు పూర్తి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో 49 డిగ్రీల ఉష్ణోగ్రతలు వం-కు నమోదవుతున్న నేపథ్యంలో, విద్యుత్ వినియోగం కూడా పెరిగిందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. అత్యధిక విద్యుత్ వినియోగంతో ట్రాన్స్ మిషన్ లైన్లు దెబ్బతినడం, ట్రాన్స్ ఫార్మార్లు వేడెక్కడం వంటి సాంకేతిక కారణాలతోనే కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. అమరావతిలోని క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రానికి సరిపడా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ కోతలు ఎక్కడా లేవని, కేవలం పలు సాంకేతిక కారణాలతోనే విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి స్పష్టం చేశారు. వినియోగదారులు విద్యుత్ సమస్యలపై సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేసి సమాచారం అందించవచ్చని వివరించారు. మూడు డిస్కంల పరిధిలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్లలో సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటారని మంత్రి తెలిపారు. సమస్యల త్వరిత పరిష్కారం కోసం కాల్ సెంటర్లలో ఇప్పటికే అదనపు సిబ్బందిని నియమించామన్నారు. ఈదురు గాలులు, వానల వలన స్తంభాలు పడిపోయి, చాలా ప్రాంతాల్లో కండక్టర్లు కట్ అవుతున్నాయన్నారు. దీనితో కూడా విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయన్నారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం విద్యుత్ శాఖ సిబ్బంది రాత్రనకా, పగలనకా కష్టపడుతున్నారని చెప్పారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం కొన్ని సార్లు చుట్టు పక్కల ప్రాంతాలలోనూ కొంత సమయం సరఫరాను ఆపి పనులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. సత్తెనపల్లిలో ట్రాన్స్ ఫార్మర్ల మరమత్తులు సమయంలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. ప్రజలు కూడా విద్యుత్ పునరుద్ధరణ చర్యలను అర్థం చేసుకుని ఓర్పుగా ఉండాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

**వైసీపీ పాలనలో ఒక్క సబ్ స్టేషన్ ను నిర్మించలేదు :** వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్కసబ్ స్టేషన్ ను కూడా నిర్మించలేదని ఇంధన మంత్రి గొట్టిపాటి విమర్శించారు. దీనితో వ్యవస్థలన్నీ స్తంభించిపోయాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రూ.6 వేల కోట్లతో ట్రాన్స్ కో సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న సుమారు 30 సబ్ స్టేషన్లు అక్టోబర్ నాటికి పూర్తవుతాయన్నారు. జిల్లాల వారీగా అవసరాన్ని బట్టి ట్రాన్స్ ఫార్మార్లను అప్ గ్రేడ్ చేస్తున్నామన్నారు. అప్ గ్రేడేషన్ తో పాటు సబ్ స్టేషన్ల నిర్మాణం పూర్తయితే రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఆటంకాలు ఉండవన్నారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఏలూరు, విజయవాడ ఎయిర్ పోర్ట్ వంటి ప్రాంతాల్లో అనుకున్న సమయానికి ముందే సబ్ స్టేషన్ నిర్మించి వినియోగంలోకి తీసుకొచ్చామన్నారు.

**అనుమతులులేని హోర్డింగ్ లను తొలగిస్తాం :** అనుమతులు లేని హోర్డింగ్ లు, ఫ్లెక్సీల వలన విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మంత్రి గొట్టిపాటి తెలిపారు. గాలి, వానల వలన హోర్డింగ్ లు, ఫ్లెక్సీలు ఊడి విద్యుత్ లైన్లపై పడుతున్నాయన్నారు. దీనితో లైన్లు తెగిపోయి, కండక్టర్లు ఊడిపోతున్నాయన్నారు. దీనితో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఈ విషయాలను మున్సిపల్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి అనుమతులు లేని హోర్డింగ్ లు, ఫ్లెక్సీలు తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. తాజాగా విజయవాడలో ఇదే విధంగా హోర్డింగ్ లు విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, దానిని పునరుద్ధరించడానికి సుమారు నాలుగు గంటలకుపైగా సమయం పట్టిందన్నారు. శ్రీకాకుళం, నంద్యాల, కర్నూలు, వంటి ప్రాంతాల్లోనూ ఇదే విధంగా విద్యుత్ స్తంభాలు కూలి, కండక్టర్లు కట్ అయిపోయాయన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ శాఖపై ఎటువంటి దృష్టి పెట్టలేదన్నారు.

# గోదావరిని కలుషితం చేస్తే ఉపేక్షించం!

(మొదటి పేజీ తరువాయి)

రాయితీ ధరలకు భూములను కేటాయిస్తున్నాం.. ప్రభుత్వం ఎంత సహకరిస్తున్నా, పరిశ్రమలకు కనీసం పర్యావరణ స్పృహ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాజమహేంద్రవరం ఆంధ్ర పేపర్ మిల్స్ లిమిటెడ్ పరిశ్రమ గోదావరిలోకి వదులుతున్న కాలుష్య జలాలను పవన్ కళ్యాణ్ మంగళవారం ఉదయం ప్రత్యక్షంగా పరిశీలించారు. కలుషిత నీటిని శుద్ధి చేసి గోదావరిలోకి విడుదల చేయాలి. తూర్పు లంకలోని లాగూన్స్ (మడుగులు)లో వీటిని వదులుతారు. పవన్ కళ్యాణ్ ఉదయాన్నే వెంకట నగరం ఘాట్ నుంచి పడవలో లాగూన్స్ వరకూ వెళ్లి ప్రత్యక్ష పరిశీలన చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మొబైల్ కిట్లతో నీటిలో కాలుష్య కారకాలు ఎంత ఉన్నాయి అన్నది అక్కడికక్కడే పరీక్షలు చేయించారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ స్పందిస్తూ- ప్రత్యక్షంగా గోదావరిలోకి కాలుష్య జలాలు ఈ స్థాయిలో కలుస్తున్నా ఇప్పటి వరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎందుకు స్పందించలేదని, కనీసం నోటీసులు ఎందుకు ఇవ్వలేదని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శంకర్ నాయక్ను ప్రశ్నించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి కాలుష్య శుద్ధి ఎలా జరుగుతుంది అన్న వివరాలు తెలుసుకుంటున్నారా? క్షేత్రస్థాయిలోకి వచ్చి ఈ మడుగులను ఎన్నిసార్లు పరిశీలించారు అని ప్రశ్నించారు. గోదావరి మధ్యలోని తూర్పులంకలో అతి పెద్ద మడుగులలో కాలుష్య కారకాలు ఉన్న నీటిని నిల్వ చేసి తర్వాత, గోదావరిలోకి ఇంకిపోయేలా చేయడం ఏమిటన్నారు. మడుగుల్లోని నీరు మొబైల్ కిట్ లో మరోసారి పరీక్షలు చేయించారు. అక్కడ గుర్రపు డెక్క భారీగా పేరుకొని ఉందంటే కచ్చితంగా జలాలు కలుషితం అయినట్లే కదా అన్నారు.

**పెండింగ్ బకాయి రాబట్టలేరా? :** కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు స్నేహపూర్వక భాగస్వామిగా ఉంటుంది. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు వస్తే, యువతకు ఉపాధి దొరుకుతుందని, రాష్ట్ర ప్రగతి పరుగులు పెడుతుందని భావిస్తాం. అయితే ఇంత



స్నేహపూర్వక వాతావరణంలో రాయితీలపై భూములు కేటాయిస్తున్నా సరే పరిశ్రమలు కాలుష్యం నివారణ విషయంలో సరైన దృష్టి పెట్టడం లేదు అనిపిస్తుంది. గాలి, నీరు కాలుష్యం విషయంలో ప్రతి పరిశ్రమ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఆంధ్ర పేపర్ మిల్స్ యాజమాన్యం ప్రభుత్వానికి పన్నులు రూపేణా చెల్లించాల్సిన రూ. 13 కోట్ల బకాయిలను వెంటనే రాబట్టేలా జిల్లా యంత్రాంగం పనిచేయాలి. ప్రభుత్వం నుంచి రాయితీలు పొందుతూ బకాయిలు కట్టకపోతే ఎలా? దీనిపై సీరియస్ గా స్పందించండి. అలాగే ప్రతి ఏటా కాలుష్య నియంత్రణకు యాజమాన్యం ఎంత మేర చిత్తశుద్ధితో చర్యలు తీసుకుంటుందో..? పరిశీలించండి. ఇంత దారుణంగా కళ్ళముందే కాలుష్యం జరుగుతున్న ఇప్పటివరకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు యాజమాన్యానికి ఎందుకు నోటీసు ఇవ్వలేదో కూడా నివేదిక ఇవ్వండి అని ఆదేశించారు.

**ప్రజలకు సమాధానం చెప్పాల్సింది మేము :** 'క్షేత్రస్థాయిలో పరిస్థితులు చక్కదిద్దాల్సింది అధికారులైతే, ప్రజాక్షేత్రంలో సమాధానం చెప్పాల్సింది ప్రజా ప్రతినిధులుగా మేము. గోదావరి కాలుష్యం మీద నా కార్యాలయానికి ఫిర్యాదులు వస్తున్నాయి. అసలు నిబంధనలు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్నాయా? పరిస్థితి చూస్తే దారుణంగా ఉంది. ప్రజలు ఏదైనా మమ్మల్ని ప్రశ్నిస్తారు. వారికి సమాధానం చెప్పాల్సింది మేము. ఇక్కడ ఉన్న జలాలు చూశాక – పుణ్య స్నానానికి వస్తే రోగాలు వస్తాయి. ఘాట్స్ సుందరీకరణ, ముస్తాబు చేస్తే సరిపోతుందా? అక్కడ స్నానం చేసే నీళ్లు శుద్ధిగా ఉండవద్దా? ఎస్టీపీ ప్లాంట్స్ లో నిబంధనల ప్రకారం శుద్ధి చేస్తున్నారో లేదో చూడాలి. పుష్కరాల్లో పన్నీరు స్నానం చేయించక్కర్లేదు... కెమికల్ స్నానం చేయించకూడదు కదా. కాలుష్య నియంత్రణ విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురండి. నేను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు క్యాబినెట్ లో చర్చించి బలమైన నిర్ణయం తీసుకుంటాం. స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా దీనిపై సీరియస్ గా దృష్టి సారించాలి. మేము ఉపాధి చూపిస్తున్నాం... మా ఇష్టం వచ్చినట్లు ఉంటాం అనడం సరికాదు. ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలు పాటించి, పర్యావరణానికి తగిన గౌరవం ఇచ్చి ముందుకు వెళ్లాలి. ఆంధ్ర పేపర్ మిల్స్ కాలుష్య పరిస్థితిపై సమగ్ర నివేదికను ఇవ్వండి. తదుపరి చర్యలు ఏం తీసుకోవాలి ఎలా ముందుకు వెళ్లాలి అన్న అంశాన్ని క్యాబినెట్లో చర్చిస్తాం " అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు, జిల్లా అధికారులకు పవన్ కళ్యాణ్ సూచించారు.

ఈ పర్యటనలో పవన్ కళ్యాణ్ వెంట రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలుగోరంట్ల బుచ్చయ్య చౌదరి, బత్తుల బలరామ కృష్ణ , ఉన్నతాధికారులు కాంతిలాల్ దండే, శరవణన్ , కీర్తి చేకూరి ఉన్నారు.

## పెరుగుతున్న ధరల నేపథ్యంలో తక్షణం ఒక డీఏ ప్రకటించాలి




**గుంటూరు,(జర్నలిస్ట్ ఫైల్) :** నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణం పెండింగ్ లో ఉన్న నాలుగు డీఏల్లో కనీసం ఒక డీఏను విడుదల చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ (ఆర్జేయూపీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. షరీఫ్ డిమాండ్ చేశారు.

మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జూలై 2024 నుంచి నాలుగు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. అలాగే ఇప్పటివరకు పీఆర్సీ కమిషన్ను కూడా నియమించకపోవడం పట్ల ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు.

డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని పలుమార్లు నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. పెరుగుతున్న ధరలతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఎన్నికల హామీ మేరకు వెంటనే పీఆర్సీ కమిషన్ను నియమించి, మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

# 20 వేల క్యూసెక్కులతో ఎనికేపాడు అండర్‌టన్నెల్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** బుడమేరు డ్రైన్ పై ఎనికేపాడు దగ్గర యూటి సామర్ధ్యాన్ని 4 వేల క్యూసెక్కుల నుండి 20 వేల క్యూసెక్కులకు పెంచుతూ, 36.1 కోట్లతో నిర్మాణ పనులను చేపట్టామని తెలిపారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. మంగళవారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ ఎనికేపాడు దగ్గర జరుగుతున్న అండర్ టన్నెల్ నిర్మాణ పనులను అధికారులతో కలసి క్షేత్ర స్థాయిలో పనులను పరిశీలించారు మంత్రి నిమ్మల రామానాయుడు. బుడమేరు వరద ముంపు నుండి విజయవాడ నగరాన్ని కాపాడేలా ఎనికేపాడు యూటీ సామర్ధ్యాన్ని 20వేల క్యూసెక్కులకు పెంచుతున్నాం అని అన్నారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందుగా వెలగలేరు రెగ్యులేటర్ కు సంబందించిన గేట్లను ఎప్పటికప్పుడు నియంత్రించేలా 1.80 కోట్ల రూపాయలతో కొత్తగేట్లు అమర్చడం జరిగిందని స్పష్టం చేశారు. అదేవిధంగా నాడు బుడమేరు గట్టుకు పడిన 3 గండ్లను పూడ్చంతో పాటు, సిసి వాల్ నిర్మాణం కూడా పూర్తి చేశామని చెప్పారు. బుడమేరు డైవర్షన్ కెనాల్ ను 37,500 క్యూసెక్కులకు పెంచేలా, 120 కోట్లతో 8.2 కి. మీ లైనింగ్ ప్రారంభించాం అని, డైవర్షన్ ఛానల్ మిగిలిన 2 కి. మీ లైనింగ్, 115 కోట్లతో థర్మల్ ప్లాంట్ పనులు టెండర్ దశ లో ఉన్నాయని అన్నారు. గత టిడిపి హాయాంలో చేపట్టిన ఎనికేపాడు యూటీ నుండి కొల్లేరు వరకు వెళ్ళే ఛానల్ విస్తరణ పనులను వైసిపి ప్రభుత్వం రద్దు చేసింది అని, దీంతో కూటమి ప్రభుత్వం ఎనికేపాడు నుండి కొల్లేరు వరకు 57 కి.మీ పొడవున బుడమేరు డ్రైన్ పూడికతీత పనులు చేపట్టిందని తెలిపారు. కొల్లేరు నుండి ఉప్పుటేరు మీదుగా బుడమేరు డ్రైన్ నీరు సముద్రంలోకి పోయేలా 9 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు సైతం జరుగుతున్నాయి అని మంత్రి నిమ్మల వివరించారు. ఈ పర్యటనలో మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు జలవనరుల శాఖ సలహాదారు వెంకటేశ్వరరావు, కెడిసి సిఈ రాంబాబు, మరియు ఇతర ఇరిగేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో ఏఐకు ఏపీ దిక్సూచి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలోనే తొలిసారిగా 'మెడ్ టెక్ ఛాలెంజ్' విధానంలో వైద్య సేవల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వినియోగించడం ద్వారా ఆంధ్రప్రదేశ్ 'లైట్ హౌస్' స్టేట్ గా నిలిచిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఏఐ వినియోగంతో నిర్వహించే వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా ఖచ్చితమైన ఫలితాలు వస్తాయని, తద్వారా ఉన్నత వైద్యాన్ని వైద్యులు వెంటనే సదరు రోగులకు అందించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు. ఏఐ వాడకంతో వ్యాధి నిర్ధారణ పరీక్షలకు తక్కువ వ్యయమవుతుందని, దీనివల్ల సదరు కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని మంత్రి పేర్కొన్నారు రోగులు త్వరగా అనారోగ్యాల నుంచి కోలుకోవడంవల్ల సదరు కుటుంబాల వారికి స్వాంతన చేకూరుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 10 రకాల వ్యాధుల భారాన్ని (అసంక్రమిత వ్యాధులు) ఏఐ ఆధారిత సేవల ద్వారా తగ్గించవచ్చునని తెలిపారు. ప్రజల జీవన విధానాన్ని మెరుగుపరచడంలో ఏఐ ఒక సాధనంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో రాబోతున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అంచనావేస్తూ అన్ని రంగాల్లో అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే.. వికసిత్ భారత్ వికసిత్ ఆంధ్రప్రదేశ్ కల త్వరగా సాకారామవుతుందన్నారు. ఈ క్రమంలోనే



వైద్య ఆరోగ్య శాఖలో మెడ్ టెక్ ఛాలెంజ్ ద్వారా రోగులకు అంకుర సంస్థలు వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేశాయని తెలిపారు.

**తక్కువ వ్యయంతో ఉత్తమ వైద్య సేవలు అందేలా అంకుర సంస్థలు ముందుకు రావాలి :** మెడ్ టెక్ ఛాలెంజ్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా 18 అంకుర సంస్థలు తమ రకరకాల ఎంక్స్పెమెంట్స్ ద్వారా ఆసుపత్రుల్లో రోగులకు ఈ మధ్య వైద్య సేవలు అందించాయి. వీటిలో ఉత్తమ ఫలితాలు కనబరిచిన అంకుర సంస్థలకు మంత్రి నగదు అందచేశారు. వాటికి ప్రశంస పత్రాలు కూడా ఇచ్చారు. మంగళగిరిలో మంగళవారం సాయంత్రం ఆరోగ్య వ్యవస్థలో ఏఐ సేవల సదస్సు ముగింపు కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏఐ వినియోగం ద్వారా వ్యవసాయం, విద్య, సామాజిక అభివృద్ధి వంటి రంగాల్లో విప్లవాత్మక మార్పుల రానున్నాయని తెలిపారు. అయితే ఇందుకు తగ్గట్లు పటిష్టమైన కార్యాచరణ ఉండాలన్నారు. తక్కువ వ్యయంతో ఉత్తమ వైద్యాన్ని అందించేందుకు అంకుర సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గత వైకాపా పాలనలో ఆరోగ్య రంగం పూర్తిగా దెబ్బతిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఆసుపత్రులను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నందున ఓపీ సేవల్లో 20% పెరుగుదల కనిపిశీచిందన్నారు. ఐపీ, డయాగ్నస్టిక్ పరీక్షలు అనూహ్యశీగా పెరిగినట్లు తెలిపారు. అభా ఖాతాల నమోదులో దేశంలోనే ఏపీ తొలి స్థానంలో ఉందని వెల్లడించారు. స్వస్తి ది హెల్త్ కేటలిస్టు సంస్థ వ్యవస్థాపకులు శివ్ కుమార్ మాట్లాడుతూ సరికొత్త సాంకేతిక వ్యవస్థలను అందిపుచ్చుకోవడంలో ఏపీ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఇందుకు తగిన వాతావరణం రాష్ట్రంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ ఆథారిటీ (ఎన్ హెచ్ ఏ ) జాయింట్ సెక్రటరీ కిరణ్ గోపాల్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదరి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**నగదు ప్రోత్సాహకాల పంపిణీ:** మెడ్ టెక్ ఛాలెంజ్ కింద 18 ఆసుపత్రుల్లో 4 కేటగిరిల్లో 18 అంకుర సంస్థలు పైలట్ ప్రాజెక్టు కింద రోగులకు సేవలు అందించాయి. ఒక్కొక్క కేటగిరిలో ప్రధమ స్థానంలో (విన్నర్) వచ్చిన సంస్థలకు మంత్రి నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. ఏఐ పవర్డ్ డయాగ్నస్టిక్స్ కేటగిరి– సొలిసిట్ టెక్నాలజీస్, పోర్టబు ల్ పాయింట్ ఆఫ్ కేర్ డివైజస్ కేటగిరి–రెమిడియో ఇన్నోవేటివ్ సొల్యూషన్స్, స్మార్ట్ మానిటరింగ్ అండ్ వెరియబుల్స్ కేటగిరి–కేర్ ఎన్ ఎక్స్ ఇన్నోవేషన్స్, రిమోట్ మానిటరింగ్ కేటగిరి–రీజువిన్ మెడికేర్ ఇండియాలు తొలి స్థానంలో వచ్చాయి. ఈ నాలుగు కేటగిరిల్లోనే మొదటి రన్నర్ అప్, రెండో రన్నర్ అప్ కలిపి మొత్తం 8 సంస్థల వివరాలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్ వెల్లడించారు. అంకుర సంస్థలు పైలట్ ప్రాజెక్ట్ కింద ఆసుపత్రుల్లో రోగులకు అందించిన సేవల వివరాలను ప్రత్యేక కమిటీ ముందు ప్రదర్శించాయి. వీటిని 'క్యాథ్' కమిటీ (కమిటీ ఫర్ అప్లయిడ్ టెక్నాలజీస్ ఇన్ హెల్త్) పరిశీలించి విన్నర్, రన్నర్ అప్ కింద సదరు కంపెనీలను ఎంపికచేశాయి.

# యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలి



- భవిష్యత్తును ప్రమాదంలో పడేసే రెగ్యులర్ నోటిఫికేషన్లులి
- నవీయ కోణంలో ప్రభుత్వం ఆలోచించాలి
- నల్లపల్లి విజయ్ భాస్కర్, రాష్ట్ర అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో గత 15 నుండి 20 సంవత్సరాలుగా అత్యంత అల్ప వేతనాలతో, ఎలాంటి సర్వీస్ రూల్స్ లేకపోయినా విద్యావ్యవస్థను తమ భుజస్కంధాలపై మోస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల ను రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు.

ఈ సందర్భంగా నల్లపల్లి విజయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ ల జీవితాలు ప్రస్తుతం తీవ్ర ఆందోళనలో పడ్డాయని, ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన రెగ్యులర్ అధ్యాపక పోస్టుల భర్తీ నోటిఫికేషన్, దశాబ్దాలుగా యూనివర్సిటీ నమ్ముకుని పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను వీధుల పాలు చేసే విధంగా ఉందని అన్నారు.

ఎన్నో ఏళ్లుగా యూనివర్సిటీలలోనే సేవలు అందిస్తూ ప్రస్తుతం 45 నుండి 55 సంవత్సరాల వయస్సుకు చేరుకున్న అధ్యాపకులు ఇప్పుడు కొత్తగా వచ్చే అభ్యర్థులతో, ఓపెన్ కాంపిటీషన్‌లో పోటీ పడటం ఆచరణాత్మకంగా సాధ్యం కాదని, ఈ వయస్సులో ఉద్యోగం కోల్పోతే వారు కుటుంబాలను పోషించుకోవడానికి మరే ఇతర ప్రత్యామ్నాయ ఉపాధిని వెతుక్కోలేరని అన్నారు. నాడు యూనివర్సిటీలలో రెగ్యులర్ అధ్యాపకులు లేని సమయంలో, అన్ని అర్హతలు (నెట్, స్లెట్, పి. హెచ్ డి) ఉండి కూడా కేవలం కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేరి నేటికీ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని, ఎంతోమంది పరిశోధనా విద్యార్థులకు గైడ్‌లుగా వ్యవహరించిన సందర్భాలు కూడా ఉన్నాయని, కానీ నేడు వీరి సుదీర్ఘ అనుభవాన్ని, సేవలను పరిగణనలోకి తీసుకోకుండా సాధారణ అభ్యర్థులతో సమానంగా చూడటం అత్యంత విచారకరం అని అన్నారు. ఎప్పుడో ఒకప్పుడు తమ సర్వీసులను క్రమబద్ధీకరిస్తారని ఆశించిన అధ్యాపకులకు, ఈ హఠాత్ నోటిఫికేషన్లు తీవ్ర నిరాశను మిగిల్చాయని, ఇన్నాళ్లు సమాజంలో ప్రొఫెసర్లుగా గౌరవం పొంది ఇప్పుడు ఉద్యోగ భద్రత లేక మానసిక క్షోభను అనుభవిస్తున్నారని విచారం వ్యక్తం చేసారు. విశ్వవిద్యాలయాల పురోభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రోడ్డున పడేయకుండా, గౌరవ ముఖ్యమంత్రి గారు మరియు విద్యాశాఖ మంత్రి గారు తక్షణమే స్పందించి, వారందరికీ న్యాయం చేయాలని నల్లపల్లి విజయ్ భాస్కర్ కోరారు.

# ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం

## నిర్వహించిన డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్

**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):** బక్రీద్ పండుగ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలలో భాగంగా సమావేశం ఏర్పాటు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని, సంతోషంగా ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలని సూచించిన డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ జంతుబలి గోవధ చేయడం వంటివి చేయకూడదు అని, అలాంటి సమాచారం ఉన్నా వెంటనే తెలియజేయాలని సూచించిన తహసీల్దార్ రాజసింహ నరేంద్ర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక సీఐ రమణారెడ్డి. ఈ సమావేశం లో పాల్గొన్న ఎస్సై కత్తి వెంకటరమణ మరియు హిందూ ముస్లిం సంఘాల పెద్దలు భూమిరెడ్డి సుబ్బరాయుడు ఎలిశెట్టి గురు ప్రసాద్ మిట్టా సురేష్ బాబు పాలమాబు దస్తగిరి సుల్తాన్ ఖాదర్ బాషా అమీర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026కు రాజకీయ పార్టీల సహకారం అవసరం

(మొదటి పేజీ తరువాయి)



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా వేగవంతమైన పట్టణీకరణ, ఉపాధి, విద్య కోసం వలసలు, జనాభా మార్పుల కారణంగా ఓటరు జాబితాల్లో అనేక లోపాలు ఏర్పడ్డాయని తెలిపారు. మరణించిన వారి పేర్లు కొనసాగడం, ఒకే వ్యక్తికి బహుళ నమోదులు ఉండటం, ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లు తొలగించబడకపోవడం వంటి సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య విశ్వసనీయతను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి అర్హత కలిగిన భారత పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం, అనర్హుల పేర్లు తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు.

రాష్ట్రంలో ఎస్ఐఆర్–2026 కార్యక్రమాన్ని జూలై 1, 2026ను అర్హత తేదీగా తీసుకుని అమలు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 5 నుంచి 14 వరకు సన్నాహక కార్యక్రమాలు, శిక్షణ, గణన ఫారాల ముద్రణ చేపట్టనున్నట్లు చెప్పారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి గణన ఫారాల పంపిణీ, సేకరణ నిర్వహిస్తారని వెల్లడించారు.

ముసాయిదా ఓటరు జాబితాను జూలై 21న ప్రచురించనున్నట్లు తెలిపారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు ఆగస్టు 20 వరకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం విచారణలు, పరిష్కార ప్రక్రియ పూర్తిచేసి సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు.

గణన ఫారాలను ఓటర్లు తప్పనిసరిగా ధృవీకరించి సమర్పించాలని సూచించారు. ఫారం సమర్పించని వారి పేర్లు ముసాయిదా జాబితాలో చేర్చబడవని స్పష్టం చేశారు. ఇల్లు తాళం వేసి ఉన్న సందర్భాల్లో బీఎల్‌వోలు కనీసం మూడు సార్లు సందర్శిస్తారని తెలిపారు.

కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం–6, సవరణలు, బదిలీల కోసం ఫారం–8, అభ్యంతరాలు, తొలగింపుల కోసం ఫారం–7 వినియోగించవచ్చని చెప్పారు. ముసాయిదా ఓటరు జాబితా, క్లెయిమ్‌లు, అభ్యంతరాల వివరాలు సీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఆధార్ కేవలం గుర్తింపు రుజువు మాత్రమేనని, పౌరసత్వానికి అది చట్టబద్ధ ఆధారం కాదని స్పష్టం చేశారు. అయితే గుర్తింపు నిర్ధారణ కోసం ఎన్నికల చట్టాల ప్రకారం ఆధార్‌ను ఉపయోగించవచ్చని పేర్కొన్నారు.

విచారణ లేకుండా ఎవరి పేరూ ఓటరు జాబితా నుంచి తొలగించబడదని హామీ ఇచ్చారు. వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు, దళితులు, గిరిజనులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ప్రత్యేక సహాయ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని వివేక్ యాదవ్ కోరారు. సమావేశంలో టిడిపి, వైసిపి, బీజేపీ, జనసేన, ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

# డీఎస్సీ నియామకాల్లో పారదర్శకత

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మెగా డీఎస్సీ–2025' ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 15941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ రికార్డు సమయంలో, పూర్తి నిబద్ధతతో విజయవంతంగా పూర్తయింది. ఈ నియామకాలన్నింటినీ అత్యంత పారదర్శకంగా, అత్యాధునిక సాంకేతిక ఆధారిత విధానంలో, చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి విద్యాశాఖ పూర్తి చేసింది.

ఈ నియామక ప్రక్రియ అంతా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు, నోటిఫై చేసిన నియామక నిబంధనలు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగానే జరిగింది. ప్రతి దశలోనూ పారదర్శకత చర్యలు, డిజిటల్ భద్రతా వ్యవస్థలు, ఫిర్యాదుల పరిష్కార విధానాలు, జిల్లా స్థాయి ధృవీకరణ వ్యవస్థలను పటిష్టంగా అమలు చేయడం జరిగింది.

**ఉద్దేశపూర్వక దుష్ప్రచారాన్ని ఖండించిన విద్యాశాఖ :** అయితే, కొన్ని వార్తాపత్రికలు, సోషల్ మీడియా వేదికలు మరియు కొందరు వ్యక్తులు కావాలనే మెగా డీఎస్సీ–2025పై నిరాధారమైన, తప్పుదారి పట్టించే ప్రచారాన్ని సాగిస్తున్నారు. ప్రభుత్వ నోటిఫైడ్ రిజర్వేషన్ విధానాలను, ముఖ్యంగా హారిజాంటల్ రిజర్వేషన్ అమలు తీరును కనీసం అర్థం చేసుకోకుండా ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగిందని, మెరిట్ జాబితాలు ప్రచురించలేదని, అక్రమ ఎంపికలు జరిగాయంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు గుప్పిస్తున్నారు.

**పాఠశాల విద్యాశాఖ స్పష్టీకరణ :** మెగా డీఎస్సీకి సంబంధించిన పూర్తి మెరిట్ జాబితాలు, ఎంపిక జాబితాలు, ఇతర అన్ని వివరాలు నోటిఫై చేసిన విధానం ప్రకారమే పారదర్శకంగా ప్రచురించబడ్డాయి. మొత్తం ఎంపిక ప్రక్రియ అంతా కేవలం మెరిట్, రిజర్వేషన్ రోస్టర్, అనేక స్థాయుల ధృవీకరణ వ్యవస్థల ఆధారంగా, అత్యంత సురక్షితమైన డిజిటల్ విధానంలోనే నిర్వహించబడింది. ఇందులో ఎలాంటి అక్రమాలకు తావులేదు.

**చట్టపరమైన చర్యలు :** ఈ అబద్ధపు ప్రచారాలు అభ్యర్థుల్లో అనవసర ఆందోళనలు రేకెత్తించడమే కాకుండా, విద్యాశాఖ ప్రతిష్టకు, నియామక ప్రక్రియ విశ్వసనీయతకు భంగం కలిగిస్తున్నాయి. దీనిని తీవ్రంగా పరిగణించిన పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే తగిన న్యాయపరమైన చర్యలను ప్రారంభించింది.

తప్పుడు ప్రచారం చేసిన సదరు మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికలు మరియు ఇతర బాధ్యులకు పరువు నష్టం నోటీసులు జారీ చేయబడుతున్నవి.

సమాజంలో గందరగోళం సృష్టించినందుకు గానూ బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేయబడుతున్నవి.

ప్రజలను, అభ్యర్థులను తప్పుదారి పట్టించేలా నిరాధార ఆరోపణలు చేసిన సదరు మీడియా సంస్థలు, సోషల్ మీడియా వేదికలు, వ్యక్తులు బహిరంగంగా, ప్రజలకు, విద్యాశాఖకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని విద్యాశాఖ డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం చేపట్టే అన్ని నియామక ప్రక్రియల్లో పారదర్శకత, నిష్పక్షపాతత్వం, ప్రతిభాధారిత (మెరిట్) ఎంపిక, బాధ్యతాయుత పరిపాలనకు పాఠశాల విద్యాశాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. అభ్యర్థులు ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని కోరడమైనది.

# రైతు బజారులో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

- మంత్రి నారా లోకేష్ చొరవతో అభివృద్ధి పనులు
- రూ.8 లక్షలతో ఆర్వో ప్లాంట్, ప్రజా మరుగుదొడ్ల ప్రారంభం
- రైతులు, వినియోగదారుల అవసరాలకే ప్రాధాన్యం : జవ్వాది కిరణ్ చంద్



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** రైతు బజారుకు వచ్చే రైతులు, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా మంగళగిరి మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో మరో ముందడుగు పడింది. మార్కెట్ యార్డు పరిధిలోని రైతు బజారులో రూ. 8 లక్షల రైతు బజార్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో నీటి ప్లాంట్, ప్రజా మరుగుదొడ్లను మంగళవారం మార్కెట్ యార్డు ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బజారుకు నిత్యం అధిక సంఖ్యలో వచ్చే ప్రజలకు తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఈ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. రైతులు, వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైతు బజారులో మౌలిక వసతులను మంత్రి నారా లోకేష్ చొరవతో మరింత అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రైతు బజార్‌లో సౌకర్యాల అభివృద్ధికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు రైతు బజార్ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. రైతులు, వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఈ ఏర్పాట్లు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో మంగళగిరి మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ యర్రగుంట్ల భాగ్యరాజు, మార్కెట్ యార్డ్ కార్యదర్శి పి. ప్రభారాణి, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రైతు బజార్ ఈఓ ఫణి, సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, రామకృష్ణ, మార్కెట్ యార్డ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# అక్రమ వలసలపై కేంద్రం కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** దేశంలో అక్రమ వలసలు, చొరబాట్ల కారణంగా జరుగుతున్న జనాభా మార్పులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా జనాభా నిష్పత్తుల్లో చోటుచేసుకుంటున్న అసాధారణ మార్పులను అధ్యయనం చేసేందుకు ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాశ్ ప్రభాకర్ నావ్లేకర్ అధ్యక్షతన ఈ కమిటీ పనిచేయనుంది.

అక్రమ వలసలు దేశ సార్వభౌమాధికారానికి, అంతర్గత భద్రతకు తీవ్రమైన సవాల్‌గా మారాయని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ దేశంలోని వివిధ సామాజిక, మత వర్గాల మధ్య జనాభా నిష్పత్తిలో చోటుచేసుకుంటున్న మార్పులను కమిటీ సమగ్రంగా పరిశీలిస్తుందని తెలిపారు. శాశ్వత పరిష్కారాల కోసం కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ముందు ఉంచుతుందని వెల్లడించారు.

దేశంలో చట్టవిరుద్ధ వలసల కారణంగా సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులు మారుతున్నాయని, ఇది జాతీయ భద్రతతో పాటు గిరిజనుల ఉనికిపై కూడా ప్రభావం చూపుతోందని అమిత్ షా ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమంగా దేశంలోకి చొరబడిన ప్రతి వ్యక్తిని గుర్తించి దేశం వెలుపలికి పంపించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో చొరబాట్లను అడ్డుకోవడం బీఎస్ఎఫ్ బాధ్యత అని పేర్కొంటూ, రహస్య మార్గాలను గుర్తించి శాశ్వతంగా మూసివేయాలని సూచించారు.

త్రిపుర, అసోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అక్రమ చొరబాట్లపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు, జిల్లా యంత్రాంగాలతో సమన్వయంతో బీఎస్ఎఫ్ పనిచేయాలని సూచించారు.

ఈ కమిటీలో దేశ జనగణన కమిషనర్‌తో పాటు మాజీ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, ఆర్థికవేత్త శామికా రవి సభ్యులుగా ఉంటారు. కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు.

అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం, సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరపడం, అక్రమ వలసల వల్ల ఏర్పడుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు విధానపరమైన మార్పులను సూచించడం కమిటీ ప్రధాన బాధ్యతలుగా కేంద్రం పేర్కొంది. నిర్దేశిత గడువులో నివేదిక సమర్పించాలని కమిటీకి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది.

# మహానాడు వర్చువల్ కార్యక్రమంలో పాల్గొని ప్రోగ్రాం విజయవంతం చేయండి



- పార్టీ శక్తిని ప్రపంచానికి చాటే మహా వేదిక ఈ మహానాడు
- కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు
- కానాల మల్లికార్జున రెడ్డి

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగు దేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "మహానాడు వర్చువల్ కార్యక్రమం" పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు దేశం పార్టీఅభిమానులు,నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు అవుతున్నారని,మహానాడు అనేది టీడీపీకి కేవలం ఒక సమావేశం మాత్రమే కాదు,పార్టీ సిద్ధాంతాలు భవిష్యత్ కార్యాచరణ ప్రజా సమస్యలపై చర్చించే గొప్ప వేదిక. ఈసారి వర్చువల్ రూపంలో నిర్వహించడం ద్వారా ప్రతి గ్రామం ప్రతి ఇంటి వరకు పార్టీ సందేశం చేరేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుల ప్రసంగాలు,భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు రాష్ట్ర రాజకీయాలపై విశ్లేషణలు కార్యకర్తలకు మార్గదర్శకాలు ప్రసారం కానున్నాయి. యువత మహిళలు సోషల్ మీడియా కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొనేలా ప్రత్యేక డిజిటల్ ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే పుట్టాసుధార్ యాదవ్ సూచించిన ఆదేశాల మేరకు కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27 వ తేదీన జరిగే " మహానాడు వర్చువల్ కార్యక్రమాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా, డిజిటల్ వేదికలను వినియోగించాలి" అని పిలుపునిచ్చారు. మహానాడు వర్చువల్ కార్యక్రమం ద్వారా పార్టీ శక్తి, ఐక్యత, కార్యకర్తల అంకితభావం మరోసారి స్పష్టమవుతుందని నాయకులు టీడీపీ మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి అభిప్రాయ పడ్డారు.

## రహదారి మరమ్మతులకు రూ.5.80 లక్షలు మంజూరు



**తాండూర్, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బెజ్జాల గ్రామం నుండి బీర్సాయిగూడ వెళ్లే రహదారి మరమ్మతులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి రూ.5.80 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ మడవి పరపత్రావు తెలిపారు. రహదారి విస్తరణ కోసం బెజ్జాల గ్రామ రైతులు స్వచ్ఛందంగా భూమి ఇచ్చేందుకు ముందుకు రావడంతో పనులకు మార్గం సుగమమైంది. రైతులకు గ్రామ సర్పంచ్, నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, ఉప సర్పంచ్ పరపత్రావు, ఏపీఎం కుమారస్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్, వార్డు సభ్యులు తిరుపతి స్వామి, మణిక్ రావు, యువజన నాయకుడు పుట్ట శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు

## గవర్నర్ పర్యటనను విజయవంతం చేయాలి



**తాండూర్, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ నెల 29న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రౌటసంకెపల్లి గ్రామానికి రానున్నారు. ఈ సందర్భంగా సుమారు 20 వేల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గవర్నర్ పర్యటన, సభను విజయవంతం చేసేందుకు తాండూర్ మండలం కిష్టంపేట గ్రామంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈకార్యక్రమంలో జాతీయ పొలిట్ బ్యూరో చైర్మన్ బుర్స పోచయ్య, తుడుందెబ్బ మండల ప్రధాన కార్యదర్శి యపాల సమ్మయ్య, కిష్టంపేట మాజీ సర్పంచ్ గడ్డం మణికుమార్, కొలవార్ సంఘం మండల అధ్యక్షులు గొలిశెట్టి బాపు, మండల నాయకులు టేకం రాజేష్, ఊరడి వెంకటేష్, టేకం రాజయ్య, ఊరడి హనుమంతు, కోయ రాజు, చింతపూరి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం మున్సిపాలిటీలో 15 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు

**-శంకుస్థాపన**



**(జర్నలిస్ట్ ఫైల్) :** జిన్నారం మున్సిపల్ పరిధిలోని శివనగర్, రాళ్లకత్వ, రాళ్లకత్వ తండా, సోలక్పల్లి, అండూర్, ఇమామ్ నగర్, ఊట్ల, దాదిగూడెం, మంగంపేట, జిన్నారం, జంగంపేట, కొడకంచి, నల్తూరు, కొర్లకుంట వార్డుల్లో 15 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి నూతనంగా ఏర్పడిన జిన్నారం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. హాజరైన మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు. పాల్గొన్నారు

## వీఓఏల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**తాండూర్, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మండలంలోని ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న గ్రామ సంఘాల సహాయకులు (వీఓఏలు) తమ సమస్యలు పరిష్కారించాని కోరుతూ గత 8 రోజులుగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. వీఓఏలకు కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 58ను సవరించడంతో పాటు ఆరోగ్య బీమా సౌకర్యం, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. ఈ సమ్మెలో సరూప, రజిత, ఉమారాణి, లావణ్య, రాజేశ్వరి, వెంకటేశం, తిరుపతి గౌడ్, జనార్ధన్, లక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**-మేయర్ మహంకాళి స్వామి**



**రామ్ మందిర్ ఏరియా, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** వడదెబ్బ బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి సూచించారు. ఇటీవల ఎండల తీవ్రత పెరగడంతో ప్రజలు వడదెబ్బ బారిన పడి అస్వస్థతకు గురవుతూ, మరణాలుసంభవిస్తున్న నేపథ్యంలో సోమవారం ఆయన ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు.వార్డులలో తిరుగుతూ రోగులతో మాట్లాడిన మేయర్ అనంతరం వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వైద్యులు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు మాత్రమే ఆసుపత్రిలో ఉంటున్నారని, విభాగాధిపతులు అందుబాటులో ఉండడం లేదని రోగులు ఫిర్యాదు చేశారు.ఆసుపత్రిలో నీటి శుద్ధి యంత్రాలు, ఫ్యాన్లు, కూలర్లు పనిచేయడం లేదని, ఐసీయూ మరియు అత్యవసర వార్డుల్లో ఏసీలు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. కొత్తగా 10 కూలర్లు, 20 ఫ్యాన్లు అవసరమని వైద్యులు వివరించారు. వడదెబ్బ ప్రభావాన్ని తగ్గించేందుకు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎంఆర్ఐ స్కానింగ్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.కొన్ని రకాల మందులు ప్రభుత్వ సరఫరాలో లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోందని వైద్యులు తెలిపారు. దీనిపై స్పందించిన మేయర్, ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలపై లిఖితపూర్వక నివేదిక అందిస్తే ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అందించాల్సిన సేవలను తప్పకుండా అందిస్తామని పేర్కొన్నారు. అత్యవసర వార్డుల్లో టవర్ ఏసీలు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని వేళలా వైద్యులు అందుబాటులో ఉండాలని, గైర్హాజరు సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఫోన్ కాల్స్‌కు వైద్యులు స్పందించాలని, ప్రైవేట్ ప్రాక్టీస్ కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. వడదెబ్బ నివారణకు ఉపయోగపడే ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఆసుపత్రితో పాటు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ప్రత్యేక ఏసీ గదులు, అంబులెన్స్ సేవలు సిద్ధంగా ఉండాలని, వార్డుల్లో నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మేయర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముస్తాఫా, ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ రాజు, వైద్యులు అశోక్, అజయ్, స్వప్నలత తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె



**రామ్ మందిర్ ఏరియా, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం సమ్మెకు దిగారు. మున్సిపల్ కమిషనర్ అరుణ్‌శ్రీ కార్మికులను ఎప్పటి నుంచో వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు.అటెండెన్స్ వ్యవస్థలో లోపాలు, వేతనాల విషయంలో నిర్లక్ష్యం, కార్మికుల పట్ల అన్యాయ వైఖరి కొనసాగుతోందని కార్మికులు మండిపడ్డారు. గతంలో జరిగిన ఒప్పందాలను అమలు చేయకపోవడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని తెలిపారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, బీ ఆర్ ఎస్ నాయకులు తదితరులు కార్మికులకు మద్దతు ప్రకటించారు. మున్సిపల్ కార్మికుల హక్కులను కాపాడాలని, వేధింపులను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని నాయకులు స్పష్టం చేశారు.

## ఎండల తీవ్రత దృష్ట్యా రామగుండం ప్రజలు ఉదయం 11 గంటల తర్వాత బయటకు రావద్దు : మేయర్ మహంకాళి స్వామి



**రామ్ మందిర్ ఏరియా, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం మేయర్ మహంకాళి స్వామి మీడియాతో మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేసే శానిటేషన్ సిబ్బంది, డ్రైవర్లు, ఫీల్డ్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉదయం 4 గంటలకే విధులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప ఉదయం 11 గంటల తర్వాత బయటకు రావొద్దని సూచించారు. ప్రత్యేకంగా చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తగినంత నీరు తాగుతూ, శరీరాన్ని చల్లగా ఉంచుకునే చర్యలు పాటించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా పనిచేస్తున్నారని మేయర్ పేర్కొన్నారు.

## మహిళా వారోత్సవాల్లో శ్రీమంతాలు అక్షరాభ్యాసం



**రాయికల్, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాయికల్ మండలం కొత్తపేట గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రం--2లో గర్భిణీ మహిళలకు శ్రీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాల వినియోగంపై మహిళలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం కీలకమనివివరించారు.కార్యక్రమంలో సర్పంచ్ మీనుగు రాజగంగు అంజయ్య, ఉపసర్పంచ్ తునికి రంజిత్‌కుమార్, కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు, కారోబార్ రమేష్, అంగన్వాడీ టీచర్లు అనురాధ, లలిత, సుజాత, ఆశా కార్యకర్తలు రజిత, సత్యవతి, ఆయమ్మలు బుచ్చమ్మ, శంకరవ్వ, లక్ష్మి, గర్భిణీలు,చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

## కార్మికులకు పనిముట్లు కల్పించడంలో విఫలమైన సింగరేణి యాజమాన్యం

**-జి ఎల్ బి కే ఎస్ --ఐ ఎఫ్ టి యు డిమాంఒ**
**-ఈదునూరి రామకృష్ణ , శంభోజీ ప్రసాద్, ఆర్జీ-1 అధ్యక్షులు**




**రామ్ మందిర్ ఏరియా, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరిఖని లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో జరిగిన రామగుండం రీజియన్ కమిటీ సమావేశంలో సింగరేణి యాజమాన్యంపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో రీజియన్ ప్రధాన కార్యదర్శి ఈదు నూరి రామకృష్ణ, ఆర్జీ-1 డివిజన్ అధ్యక్షులు ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న అండర్‌గ్రౌండ్ కార్మికులు సరైన పనిముట్లు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.గత మూడు నెలలుగా కోల్ కట్టర్ కార్మికులు, సపోర్ట్ కార్మికులు, లైన్‌మెన్‌లు అవసరమైన పనిముట్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సపోర్ట్ పనుల కోసం అవసరమైన తుంటాలు అందించడం లేదని, కోల్ కట్టర్ కార్మికులకు డ్రిల్ బిట్లు, లైన్‌మెన్‌లకు డాగ్ నీల్స్ ఇవ్వకపోవడం సరికాదని విమర్శించారు.ప్రతి సంవత్సరం కార్మికులు సాధిస్తున్న లాభాల్లో సంక్షేమం కోసం రూ.200 కోట్లు కేటాయిస్తున్నామని యాజమాన్యం చెబుతోందని, అయితే ఆ నిధులు ఎక్కడ వినియోగం అవుతున్నాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే ౨ాణా, ౨ాఎణ యంత్రాలకు సరైన పనిముట్లు లేకపోవడం, ఉన్న యంత్రాలు కాలపరిమితి ముగిసినవిగా మారడంతో కార్మికులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందన్నారు.గనుల్లో గాలి, నీటి వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో కూడా యాజమాన్యం విఫలమైందని ఆరోపించారు. కార్మికులు పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదని పేర్కొన్నారు. వెంటనే పనిముట్లు సరఫరా చేయకపోతే రక్షణ చర్యలకు ఆటంకాలు ఏర్పడి ప్రమాదాలు జరిగేఅవకాశం ఉందని,అలాంటి ఘటనలకు పూర్తిబాధ్యత సింగరేణియాజమాన్యానిదేనని హెచ్చరించారు.ఈ సమావేశంలో రామగుండం రీజియన్ అధ్యక్షులు బి. అశోక్, రీజియన్ కోశాధికారి గుండేటి మల్లేశం, దుర్గయ్య, బి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యకర సమాజం

**-ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఉమెన్స్ వీక్ కార్యక్రమం**



**జగిత్యాల, (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమంలో ఉమెన్స్ వీక్ సందర్భంగా జగిత్యాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అర్బన్ రెండవ సెక్టార్‌లో చింతకుంటవాడ, కిలగడ్డ మసీదు చౌరస్తా అంగన్వాడి కేంద్రాలలో న్యూట్రిషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్లు పద్మ రాజేందర్, ఆయుబ్ ఖాన్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ తల్లులు, పిల్లలు రక్తహీనతకు గురికాకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ ఆహార పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవాలని తెలిపారు. మహిళలు, కిశోర బాలికలు, చిన్నారుల పోషక స్థితి మెరుగుపడేందుకు తక్కువ ఖర్చుతో లభించే పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు.జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి ఇంట్లో తయారు చేసిన ఆహారాన్నే తీసుకోవాలని సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలతో ప్రత్యేక ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు ఇంద్రజ, లక్ష్మి, రాధిక, గంగాభవాని, ఆశ కార్యకర్త వనజ, వార్డు ఆఫీసర్ సంతోష్తో పాటు గర్భిణీలు, తల్లులు, పిల్లలు, కిశోర బాలికలు, స్థానికులు పాల్గొన్నారు.

## పేలిన లారీ టైరు ఒకదానికొకటి ఢీకొన్న వాహనాలు



(నిజామాబాద్ రూరల్ ఇందల్వాయి జర్నలిస్ట్ ఫైల్ (ప్రతినిధి) ఇందల్వాయి మండలం చంద్రాయాన్ పల్లి లో హైవే పై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. హైవే పై వెళ్తున్న లారీ టైరు పేలడంతో వెనుక వెళ్తున్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో నిజ్జయిన కారు పలువురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు కావడంతో నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని ఎస్ఐ నరేష్ తెలిపారు. పోలీసులు ట్రాఫిక్ ను అదుపులోకి తీసుకొచ్చారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రైతు గోస - బీజేపీ బరోసా కార్యక్రమం

### రైతు వెంటే బీజేపి, చివరి గింజ కొనేవరకు పోరాటం

### వరంగల్‌లో రేవంత్ చెప్పిన రైతు న్యాయం ఎక్కడ..

### గజ్వేల్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు రైతులకు బేడీలు వేసిన చరిత్ర ఆయనది

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు



గజ్వేల్, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) : గజ్వేల్ ఎమ్మెల్యే, ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ రైతులకు బేడీలు వేసిన చరిత్ర కలిగిన వ్యక్తి అని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులను మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు తీవ్ర విమర్శలు చేశారు. ఇద్దరూ రైతు ద్రోహులే అంటూ మండిపడ్డారు. బీజేపీ రైతు భరోసా యాత్రలో భాగంగా గజ్వేల్ మార్కెట్‌కు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతులతో మమేకమై వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి సహకారం అందడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు బీజేపీ నాయకులకు వివరించారు. రైతులకు "మేమున్నాం" అనే భరోసాను బీజేపీ నేతలు కల్పించారు. బీజేపీ నేతలు వస్తున్నారనే సమాచారం తెలిసిన వెంటనే అధికారులు హుటాహుటిన ధాన్యాన్ని తరలించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఇన్ని రోజులు ప్రభుత్వం నిద్రపోయిందా, నెల రోజులుగా రైతులు కన్నీరు మున్నీరవుతుంటే పాలకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రోడ్లపై ధాన్యం తడుస్తూ ఉండగా, వడ్లు మొలకెత్తుతున్నా కొనుగోలు కేంద్రాలు స్పందించడం లేదని విమర్శించారు. పొద్దు తిరుగుడు పంట కూడా నెల రోజులుగా కొనుగోలు కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్న ప్రభుత్వ ప్రకటనలు పూర్తిగా అబద్ధం. ఇప్పటికీ రింగ్ రోడ్ చుట్టూ, గ్రామాల్లో ఎక్కడ చూసినా ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి" అని పేర్కొన్నారు. రైతుకు న్యాయం జరిగే వరకు బీజేపీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రైతులకు అండగా నిలిచి ఉద్యమం చేస్తారని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు ప్రారంభించకపోతే ఉద్యమం మరింత ఉధృతమయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, రామారావు పటేల్, హరీష్, బీజేపీ అధికార ప్రతినిధి కప్పర ప్రసాద్ రావు, రాంరెడ్డి, కుడికెల రాములు, బీజేపీ జిల్లా అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, నాలుగో వార్డ్ కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, గజ్వేల్ పట్టణ అధ్యక్షులు మనోహర్ యాదవ్, రొట్టెల రాందాస్, గర్నేపల్లి కృష్ణమూర్తి, అశోక్, ఐలయ్య, తిరుపతిరెడ్డి, సంపత్ రెడ్డి, రామ్ రెడ్డి, సత్యం, లక్ష్మణ్, వెంకట్ గౌడ్, జానకిరామ్, పోచయ్య, వెంకట్ రెడ్డి, సందీప్, వెంకటేష్ శివకుమార్ లతో పాటు జిల్లా, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు,ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

### విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 26 (జర్నలిస్ట్ ఫైల్) : ఖరీఫ్ సీజన్ ను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో నకిలీ విత్తనాలు చెలామణి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.రైతాంగ ప్రయోజనాలను కాపాడడమే పరమావధిగా అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం వ్యవసాయ,ఉద్యానవన శాఖ అధికారులతో పాటు ఎరువులు విత్తనాల డీలర్లతో,రైస్ మిల్లర్లతో కలెక్టర్ అవగాహన సదస్సు నిర్వహించారు.ఖరీఫ్ పంటల సాగుకు అవసరమైన ఎరువులు,విత్తనాల కొరత తలెత్తకుండా రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.అయితే నకిలీ,నాసిరకం విత్తనాలతో రైతులు నష్టపోకుండా చూడాల్సిన గురుతర బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ముఖ్యంగా ప్రైవేట్ కంపెనీల ద్వారా మార్కెట్లో చెలామణి అయ్యే అన్ని రకాల విత్తనాలను క్రమబద్ధీకరించాలని ఆదేశించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడ కూడా నకిలీ విత్తనాలు అనే పదం వినిపించకూడదని,ఈ విషయంలో అప్రమత్తతో విధులు నిర్వర్తించాలని అన్నారు.మండల వ్యవసాయ అధికారులు,వ్యవసాయ విస్తరణ అధికారులు నకిలీ విత్తనాల బెడద లేకుండా పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని అన్నారు.ఎవరైనా నకిలీ,నాసిరకం విత్తనాలు,ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని,కేసులు నమోదు చేసి రికవరీ యాక్టు అమలు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.డీలర్లను ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని,ఏ ఒక్క రైతు నకిలీ విత్తనాల వల్ల నష్టపోకూడదు అన్న సంకల్పంతో ఈ చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.దీనిని దృష్టిలో పెట్టుకొని తనిఖీకి వచ్చే అధికారులకు సహకరించాలని డీలర్లకు సూచించారు.జిల్లాకు వ్యవసాయ రంగంలో మంచి పేరు ఉందని,దానిని నిలుపుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని అన్నారు.క్షేత్రస్థాయిలో ఎరువులు విత్తనాల దుకాణాలలో తనిఖీలు నిర్వహించిన వివరాలను నివేదిక రూపంలో తనకు ఎప్పటికప్పుడు సమర్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.క్రాప్ బుకింగ్ ఫార్మర్ రిజిస్ట్రీ విషయంలోనూ ఖచ్చితత్వంతో వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు.లేనిపక్షంలో పంట సేకరణ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని అన్నారు.ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వ్యవసాయ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.అవగాహన సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి,డీఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి,సివిల్ సప్లైస్ డీఎం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# కొడకండ్ల శ్రీరామ్ అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక

### అభినందించ బస్వరాజ్ కుమార స్వామి,చిప్ప వెంకటేశ్వర్లు



వరంగల్ ప్రతినిధి మే 26 (జర్నలిస్ట్ ఫైల్) : అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు కొడకండ్ల శ్రీరామ్ ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజ్ కుమారస్వామి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు అన్నారు.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన యువ హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు కొడకండ్ల శ్రీరామ్ ఈ నెల 27 నుంచి వచ్చే నెల జూన్ 8వ వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుద్రాపూర్‌లో నిర్వహించనున్న ఇండియన్ నేషనల్ హ్యాండ్‌బాల్ కోచింగ్ క్యాంప్‌కు శ్రీరామ్ ఎంపిక కావడం హర్షనీయమన్నారు అనంతరం జూన్ 10 నుంచి 14వ వరకు బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో నిర్వహించనున్న అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ సందర్భంగా వారు అభినందిస్తూ..హనుమకొండ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలో హ్యాండ్‌బాల్ కోచ్ విష్ణువర్ధన్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతున్న శ్రీరామ్ తన ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదలతో జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. ఓరుగల్లు కీర్తిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న శ్రీరామ్‌కు అన్ని వర్గాల ప్రజలు ప్రోత్సాహం అందించాలని కోరారు.

### పేద కుటుంబం నుంచి అంతర్జాతీయ స్థాయికి

పేద కుటుంబానికి చెందిన శ్రీరామ్ ఇప్పటివరకు 12 జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో, 20 రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎన్నో ప్రశంసలు అందుకున్నాడు. తన కఠోర శ్రమతో రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి, అక్కడి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి ఓరుగల్లు ప్రతిష్ఠను దేశవ్యాప్తంగా చాటుతున్నాడు.శ్రీరామ్ తండ్రి సునీల్ సంప్రదాయ వృత్తి అయిన వడ్ల (కార్పెంటర్) పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు అవసరమైన ఖర్చులు భరించడం కష్టంగా మారిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణ ఖర్చులు, కిట్, ఇతర అవసరాల కోసం ఆర్థిక సహాయం అవసరమని తెలిపారు.అంతర్జాతీయ వేదికపై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం ప్రతి క్రీడాకారుడికి రావడం అరుదైన గౌరవమని, ఇలాంటి సమయంలో దాతలు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి శ్రీరామ్‌కు ఆర్థికంగా చేయూతనందించాలని విజ్ఞప్తి చేశారు. సరైన ప్రోత్సాహం లభిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి దేశానికి పతకాలు తీసుకురాగల సామర్థ్యం శ్రీరామ్‌కు ఉందని పేర్కొన్నారు.సహాయం చేయదలచిన వారు ఫోన్‌పే నెంబర్ 6305046603(కొడకండ్ల మాదేవి), కు ఆర్థిక సహాయం అందించి ఈ యువ క్రీడాకారుడిని ప్రోత్సహించాలని కోరారు.

# వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

### మేలు రకం విత్తనాలను వినియోగించాలని రైతులకు పిలుపు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 26 (జర్నలిస్ట్ ఫైల్) : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ అధికారులు,శాస్త్రవేత్తల సూచనల మేరకు మేలైన పంటలు సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి రైతులకు పిలుపునిచ్చారు.ఖరీఫ్ సీజన్ ను పురస్కరించుకుని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఖరీఫ్ సీజన్ కు సరిపడా ఎరువులు,విత్తనాల పంపిణీపై చర్చించి,అధికారులకు సూచనలు చేశారు.అనంతరం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ....ఈసారి ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువగా కురుస్తాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున,తక్కువ నీటి వినియోగం అవసరం అయ్యే స్వల్పకాలిక పంటలను సాగు చేయాలని రైతులను కోరారు.కేవలం వరి పంటకే పరిమితం కాకుండా జొన్న,మొక్కజొన్న,పొద్దు తిరుగుడు వంటి పంటలను సాగు చేయాలని హితవు పలికారు.అధిక దిగుబడిని అందించే నాణ్యమైన విత్తనాలను వినియోగించాలని,మేల్ సీడ్ ను వాడవద్దని సూచించారు.ఖరీఫ్ లో జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు,విత్తనాలు అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు.లారీలు,హమాలీల కొరత,ఎండ తీవ్రత వంటి అనేక ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నప్పటికీ,వాటిని అధిగమిస్తూ రబీలో రాష్ట్రంలోనే అత్యధిక స్థాయిలో నిజామాబాద్ జిల్లాలో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు.దిగుబడులు ఆలస్యంగా వచ్చిన బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో మినహాయిస్తే,జిల్లాలో ధాన్యం సేకరణ పూర్తయ్యిందని అన్నారు.బాల్కొండ సెగ్మెంట్ లో సైతం ఒకటి రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని తెలిపారు.

### యువత కోసం ప్రత్యేకంగా శిక్షణ తరగతులు

యువత విరివిగా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభించేలా జిల్లా కేంద్రంలోని న్యాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి తెలిపారు.సోమవారం ఆయన కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శిక్షణ తరగతుల ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.సాంకేతిక విద్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేశారు.ఇందులో భాగంగానే నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు న్యాక్ ద్వారా ప్లంబింగ్, హౌజ్ వైరింగ్, ఫిట్టర్, సెంట్రింగ్, మెసన్, యూనిఫాం స్టిచింగ్ వంటి కోర్సులలో శిక్షణ అందించేందుకు జిల్లా యంత్రాంగం ద్వారా త్వరలోనే ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ వెలువరిస్తారని అన్నారు.మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సమీక్షా సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్,రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి,ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్ పర్సన్ డాక్టర్ కవితా రెడ్డి,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## విశాల్ పెరిఫెరల్స్‌తో పాంటమ్ ఇండియా వ్యూహాత్మక భాగస్వామ్యం సికింద్రాబాద్



బేగంపేట, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) : ముద్రణ రంగంలో ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన పాంటమ్ ఇండియా విశాల్ పెరిఫెరల్స్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా భారతదేశంలో తన ఉనికిని బలోపేతం చేసుకొనున్నట్లు విశాల్ పెరిఫెరల్స్ డైరెక్టర్ వికాస్ హిసారియ తెలిపారు. బేగంపేట లో సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ మోడల్ ఇటీవల జరిగిన మిస్ తెలంగాణ అందాల పోటీలలో ఫైనలిస్ట్ గా నిలిచిన ఫసిహ నౌమాన్ హాజరయ్యారు. అనంతరం విశాల్ పెరిఫెరల్స్ షో రూమ్ లో పాంటమ్ ప్రింటర్ల శ్రేణిని పాంటమ్ ఇండియా కంట్రీ మేనేజర్ నితీష్ ఇలా, విశాల్ పెరిపెరల్స్ ఎండీ వికాస్ హిసారియాతో కలసి ఆవిష్కరించారు.దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ రిటైల్ విస్తరణను ప్రోత్సహించడానికి, పాంటమ్ ఇండియా 2026 రోడ్‌మ్యాప్‌ను వేగవంతం చేయడానికి విశాల్ పెరిఫెరల్స్ యొక్క విస్తృతమైన ఐటి రిటైల్ నెట్‌వర్క్ ద్వారా వినియోగదారులను చేరువ చేసుకుని మరింత బలోపేతం చేయడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందన్నారు. ప్రింటింగ్ సొల్యూషన్స్‌లో ప్రపంచవ్యాప్త ఆవిష్కర్త అయిన పాంటమ్, భారతదేశంలోని ప్రముఖ ఐటీ రిటైల్ డిస్ట్రిబ్యూషన్ బ్రాండ్‌లలో ఒకటైన విశాల్ పెరిఫెరల్స్‌తో ఒక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు.ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఛానెళ్లలో పాంటమ్ ఉనికిని గణనీయంగా విస్తరించడంతో పాటు, వినియోగదారులకు అందుబాటును, రిటైల్ గుర్తింపును అమ్మకాల తర్వాత మద్దతును బలోపేతం చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా పాంటమ్ ఇండియా కంట్రీ మేనేజర్ నితీష్ మాట్లాడుతూపాంటమ్ ప్రపంచవ్యాప్త వృద్ధికి భారతదేశం ఒక కీలకమైన మార్కెట్ గా అభివర్ణించారు. విశాల్ పెరిఫెరల్స్‌తో తమ భాగస్వామ్యం విస్తరణ వ్యూహంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందన్నారు. విశ్వసనీయతకు మారుపేరుగా రిటైల్ వ్యవస్థ ద్వారా వినియోగదారులకు చేరువ చేసేందుకు మంచి అవకాశం అని అన్నారు.. విశాల్ పెరిఫెరల్స్ అపారమైన మార్కెట్ నైపుణ్యం, ధరలు, నెట్వర్క్ ను బలోపేతం చేస్తూ అత్యుత్తమసేవ అందించినట్లు తెలిపారు. భారతదేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారాలకు వినియోగదారులకు అధిక నాణ్యత గల లేజర్ ప్రింటింగ్ పరిష్కారాలను మరింత అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని వెల్లడించారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పవర్ లిఫ్టింగ్ లో పతకాల పంట

### జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 26 (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాదులోని సనత్ నగర్ లో సబ్ జూనియర్- జూనియర్, మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 04 బంగారు పతకాలు,01 రజిత పతకం, 02 కాంశ్య పతకాలు, మొత్తం మీద ఏడు పతకాలు సాధించినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ జివి రామిరెడ్డి తెలిపారు. వీరిలో భద్రాచలం సిటీ స్టైల్ జిమ్ కు చెందిన మోడెమ్ వంశీకి బంగారు పతకం, డివి శంకర్రావుకు బంగారు పతకం, మహంతి వెంకటకృష్ణాజీకి కాంశ్య పతకం, పాల్వంచకు చెందిన పి రాజేష్ కు బంగారు పతకం, దివాకర్ కు రజిత పతకం, శేషు కు కాంశ్య పతకం, మణుగూరుకు చెందిన తోలెం పార్థు టెండూల్కర్ కు బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. ఈ గెలుపొందిన క్రీడాకారులను, పట్టణంలోని పలు క్రీడా సంఘాలు, క్రీడా సంఘాల నాయకులు, మరియు రాజకీయ నాయకులు, పట్టణ ప్రముఖులు మరియు గ్రీన్ భద్రాద్రి సభ్యులు సిటీ స్టైల్ జిమ్ సభ్యులు తదితరులు అందజేశారు.

## హఫీజ్ పేట్ డివిజన్ పరిధిలో సీఎంసీ

### వివిధ శాఖల అభివృద్ధి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి

### కైతాపురం జితేందర్ బీజేపీ అధ్యక్షులు హఫీజ్ పేట్ డివిజన్



హఫీజ్ పేట్, మే 26(జర్నలిస్ట్ ఫైల్): హఫీజ్ పేట్ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో సీఎంసీ - మియాపూర్ సర్కిల్ డీసీ శ్రీమతి శశిరేఖకు ప్రజావాణిలో భాగంగా వివిధ సమస్యలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది,హుడా కాలనీ లోనీ మల్లయ్య కుంటను అభివృద్ధి చేయాలి,విద్యా వాణి హై స్కూల్ ప్రక్కన ఉన్న స్థలం పార్క్ గా అభివృద్ధి చేయాలి అని, హుడా కాలనీ వాటర్ సంప్ ప్రాంతంలో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలని,సంబంధిత అధికారులు వెంటనే పర్యవేక్షించి,సమస్యలను పరిష్కరించాలి అని డీసీని కోరడం జరిగింది,ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రమణయ్య , హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు , హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు నరసింహ యాదవ్, డివిజన్ బీజేపీ ఓబీసీ మోర్చా కోశాధికారి పవన్ కుమార్, బీజేపీ నాయకులు విజయ్ ,హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శం మన మహిళలు

### ఒకేరోజు 8 వేల ఇందిరా స్త్రీ శక్తి భవనాల నిర్మాణం

### త్వరలోనే ఇందిరా మహిళా శక్తి కార్పొరేట్ సూపర్ బజార్లు,లాజిస్టిక్ హబ్లు,గోదాములు,రైస్ మిల్లులు. సచివాలయం నుంచి వర్చువల్ గా శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి మే 26 (జర్నలిస్ట్ ఫైల్) : 2034 నాటికి కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు.'మహిళలు ఆర్థికంగా నిలబడితే కుటుంబం నిలబడుతుంది,కుటుంబం నిలబడితే గ్రామం బలపడుతుంది,గ్రామం బలపడితే తెలంగాణ అభివృద్ధి చెందుతుంది' అన్నారు.మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.సోమవారం సచివాలయం వేదికగా రాష్ట్రంలో నిర్మిస్తున్న 8 వేల ఇందిరా గాంధీ స్త్రీ శక్తి భవనాల నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు.మహిళలను ఆర్థికంగా నిలబెట్టే దిశగా ఇది చారిత్రక కార్యక్రమమని సీఎం అన్నారు.అదే వేదికపై చిలకపచ్చ రంగులో ఉన్న ఇందిరమ్మ చీరల నాలుగు కొత్త డిజైన్లను కూడా సీఎం ఆవిష్కరించారు.సీఎంతో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క,మంత్రులు సీతక్క,శ్రీధర్ బాబు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రాజ్య సభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ సలహాదారు హర్కార వేణు గోపాల్,మహిళా కమిషన్ చైర్మన్ గద్వాల్ విజయ లక్ష్మి,ఎమ్మెల్యేలు,వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు,ఆయా విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు రూ.60,472 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించిందని,వడ్డీ లేని రుణాలకు ఇప్పటికే రూ.1,390 కోట్లను చెల్లించిందన్నారు.మహిళా సంఘాలు ఇకపై చిన్నచిన్న ఉపాధి కార్యక్రమాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాల్లోకి రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.రైస్ మిల్లులు,మండల స్థాయిలో గోదాములు,లాజిస్టిక్ పార్కులు నిర్మించుకోవాలని సూచించారు.వాటికి అవసరమైన చోట భూములను కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.అవసరమైతే 100 ఎకరాల వరకు భూములు ఇవ్వడానికి సిద్ధమని అన్నారు.ధాన్యం కొనుగోలు,నిల్వ,మిల్లింగ్ వ్యవస్థలో మహిళా సంఘాల పాత్ర పెరగాలని సీఎం అన్నారు.సంఘాలే వడ్లు కొనుగోలు చేసి,బియ్యం ప్రభుత్వానికి అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఆడబిడ్డలు ప్రతి గింజకు జవాబుదారులుగా ఉంటారని,వారి చేతుల్లోకి ఈ వ్యవస్థ వెళ్తే పారదర్శకత,బాధ్యత మరింత పెరుగుతుందన్నారు.మహిళా సంఘాల ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహాలో మహిళా శక్తి సూపర్ బజార్లు నెలకొల్పాలని ముఖ్యమంత్రి సూచించారు.డీమార్ట్,బిగ్‌బజార్‌లకు పోటీగా ఉండేలా అద్భుతమైన మహిళా శక్తి సూపర్ బజార్లు ఏర్పాటు చేయాలని అన్నారు.పట్టణాల్లో సూపర్ బజార్ల ఏర్పాటుకు తక్కువ ధరకు స్థలాలను లీజుకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.నాణ్యమైన వస్తువులు ప్రజలకు అందుబాటులోకి రావాలి,రైతుల ఉత్పత్తులకు మార్కెట్ దొరకాలి,మహిళా సంఘాలకు ఆదాయం రావాలి అన్నదే ఈ ఆలోచన వెనుక ఉన్న లక్ష్యమని వివరించారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా మహిళా శక్తి సూపర్ బజార్లలో వాటాదారుగా ఉంటుందని,రైతులు పండించే మంచి పంటలు,ఆర్గానిక్ ఉత్పత్తులు,నిత్యావసర సరుకులు వీటి ద్వారా వినియోగదారులకు చేరేలా చూడాలని అన్నారు.గ్రామీణ ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభిస్తే రైతులకు మేలు జరుగుతుందని,వినియోగదారునికీ నాణ్యమైన వస్తువు,మహిళా సంఘాలకూ ఆదాయం లభిస్తుందని చెప్పారు.ఒకే రోజు,ఒకే సమయంలో 8 వేల భవనాలకు శంకుస్థాపన చేయడం దేశంలోనే సంచలన నిర్ణయమని సీఎం అన్నారు.మహిళా సంఘాలకు సొంత భవనాలు ఉండటం అంటే కేవలం సమావేశాల స్థలం ఇవ్వటం కాదని,వారి ఆర్థిక కార్యకలాపాలకు,శిక్షణకు,వ్యాపార ప్రణాళికలకు శాశ్వత వేదికను నిర్మించడమని చెప్పారు.తెలంగాణ ఆడబిడ్డల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం మహిళా శక్తిని దేశానికి ఆదర్శంగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు సాగుతోందని అన్నారు.

# మహానాడు ప్రజల గుండెచప్పుడు



- తెలుగు తమ్ముళ్లకు పండుగ రోజు
- అన్న నందమూరి ఆశయ సాధనకు కృషి
- సీఎం చంద్రబాబు దార్శనికతతో రాష్ట్రంలో అభివృద్ధి
- ఎమ్మెల్యే నసీర్ ఆదేశాలతో మహానాడు ఏర్పాట్ల పరిశీలన

**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** మహానాడు అంటే ఆంధ్ర రాష్ట్రానికి దిక్సూచి అని, తెలుగు తమ్ముళ్ల గుండెచప్పుడు అని ఆంధ్రప్రదేశ్ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పీ ఈశ్వర్ అన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మహానాడు కార్యక్రమం ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించారు. తొలుత డిజిటల్ మహానాడు కార్యక్రమ నిర్వహణ గురించి పార్టీ కార్యాలయంలో శ్రేణులతో సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి మహానాడు వేదిక అని తెలిపారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయాలతో పురుడు పోసుకున్న తెలుగుదేశం పార్టీ ప్రతి గడపలోకి సంక్షేమాన్ని తీసుకెళ్లిందని చెప్పారు. అన్న ఎన్టీఆర్ ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రప్రగతికి శ్రీకారం చుట్టారని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నవ్యాంధ్రకు కొత్త శోభ తీసుకొచ్చిందని తెలిపారు. అమరావతి రాజధాని ప్రపంచ పటంలో గొప్ప స్థానం కల్పించే విధంగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. విద్య, వైద్య రంగాలతోపాటు పారిశ్రామిక అభివృద్ధికి పెద్ద పీట వేసినట్లు తెలిపారు. యువ నాయకులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోందని అన్నారు. ఒక మహానాడు కార్యక్రమం జరిగిందంటే అది ఆంధ్ర రాష్ట్రానికి ఒక వెలుగు రేఖగా మారుతుందనే విషయాన్ని ప్రజల నమ్ముతున్నారని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులందరూ మహానాడు కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# టీడీపీ అనుబంధ విభాగలలో సముచిత స్థానం



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగుదేశం పార్టీ పలు అనుబంధ విభాగాలకు సంబంధించి ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయిలో స్థానిక శాసనసభ్యులు డా బూర్ల రామాంజనేయులు విడుదల చేసిన విభాగాలలో కాకుమాను మండలానికి చెందిన పలువురికి సముచిత స్థానం లభించింది. ఐటీడీపి విభాగం లో ప్రత్తిపాడు నియోజకవర్గం ఐటీడీపి అధ్యక్షులు గ కాకుమాను మండల పరిధిలోని కొండపాటూరు గ్రామానికి చెందిన గింజపల్లి నవీన్ ఎంపిక అయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా గరికపాడు గ్రామానికి చెందిన వేముల ప్రేమ్ చంద్ ఎంపికయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఎస్ సి సెల్ వైస్ ప్రెసిడెంట్ గా కాకుమాను గ్రామానికి చెందిన మద్దు సూర్య తేజ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పార్టీ తమపై నమ్మకంతో ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. మండల పరిధిలోని నాయకులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# వనిపెంట పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిస్టిక్ ఇమ్యూనైజేషన్ ఆఫీసర్



**మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్) :** మైదుకూరు మండలం వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జె ప్రవీణ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా అన్ని రకాల నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాం ల గురించి హెచ్.పి వి వాక్సినేషన్ మరియు 0హ5 సం. రాల లోపు పిల్లలకు జూన్ నెల 28,29ఄ30 వ తేదీల్లో జరగనున్న పల్స్ పోలియో ప్రోగ్రాం గురించి రివ్యూ మీటింగ్ నిర్వహించడం జరిగింది అదేవిధంగా చాదీనూ గురించి కూడా తెలియజేశారు ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారులు తేజ్ దీప్ జివి శ్రీకాంత్ ఎం పి హెచ్ ఇ ఓ ఏం వివి ప్రసాద్ హెల్త్ సూపర్వైజర్ రాఘవేంద్ర రాజు మరియు పి. హెచ్ . సి సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ప్రత్యేక ఎరువుల కార్డులు జారీ : జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ

- ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** జిల్లాలో రైతులకు ప్రత్యేకంగా ఎరువుల కార్డులను జారీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ తెలిపారు. జూన్ మొదటి వారంలో రైతులకు కార్డులు పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

రైతులు సాగు చేస్తున్న పంటకు అవసరమైన ఎరువుల పరిమాణాన్ని సూచిస్తూ ఈ కార్డులు అందజేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అధికంగా యూరియా, ఇతర ఎరువులు వినియోగించడం వల్ల రైతులకు అదనపు భారం పడటమే కాకుండా పర్యావరణంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని చెప్పారు. అవసరమైన పరిమితిలోనే ఎరువులు వినియోగించి నాణ్యమైన దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పొన్నూరు, ఫిరంగిపురం, తెనాలి, మేడికొండూరు, కాకుమాను మండలాల్లో పంపిణీ మరింత వేగంగా చేపట్టాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ యాప్‌లో రైతుల వివరాలు కేవలం 30 శాతం మాత్రమే నమోదయ్యాయని, తెనాలి, మంగళగిరి, తాడికొండ, పొన్నూరు, కొల్లిపర మండలాల్లో నమోదు ప్రక్రియను మెరుగుపరచాలని ఆదేశించారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసేందుకు అర్హుల జాబితాను వెంటనే నవీకరించాలని తెలిపారు. ఉద్యానవన పథకాల అమలుపై స్పష్టమైన నివేదికలు సిద్ధం చేసి లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర సూక్ష్మ నీటి పథకం (ఏపీఎంఐపీ) కింద లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు.

**ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తత అవసరం**

ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని, రైతులకు ముందస్తు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రకృతి వ్యవసాయం వాతావరణ మార్పులకు తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుతుందని నిపుణులు సూచిస్తున్నారని చెప్పారు. జిల్లాలో 46,594 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కిట్లను వెంటనే పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. కాకుమాను మండలంలో కిట్ల పంపిణీ సంతృప్తికరంగా జరిగిందని అభినందించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎం. పద్మావతి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు జిల్లాకు 18,600 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమవుతాయని తెలిపారు. ఏపీ సీడ్స్, ప్రైవేట్ సంస్థల ద్వారా జూన్ మొదటి వారంలో రైతులకు విత్తనాలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. నాణ్యమైన విత్తనాల సరఫరా కోసం జులై మొదటి వారంలోపు నమూనాల సేకరణ పూర్తిచేస్తామని తెలిపారు. భూసారం పెంపు కోసం 1,639 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. పీఎండీఎస్ విధానంలో జిల్లాలో 18,637 విత్తన సంచులు పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఖరీఫ్ 2026కు జిల్లాకు 57 వేల టన్నుల ఎరువులు అవసరమవుతాయని, ఇప్పటికే 36,371 టన్నుల ఎరువులు నిల్వ చేసినట్లు తెలిపారు. ఇందులో 12,588 టన్నుల యూరియా, 4,931 టన్నుల డీఏపీ, 16,207 టన్నుల కాంప్లెక్స్, 1,180 టన్నుల పొటాష్, 1,464 టన్నుల సూపర్ ఫాస్ఫేట్ ఉన్నాయని చెప్పారు.

వ్యవసాయ యంత్ర పరికరాల కోసం రూ. 3.04 కోట్లు మంజూరయ్యాయని, రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే పరికరాల పంపిణీ పూర్తిచేస్తామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రైతుల అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి. సత్యనారాయణ, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు సత్యనారాయణ చౌదరి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ టి. నరసింహారెడ్డి, ఏపీఎంఐపీ అధికారి ఎల్. వజ్రశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# బక్రీద్ పండుగను సహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలి

- గుంటూరు కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు నగరంలో బక్రీద్ పండుగను శాంతియుత, సహృద్భావ వాతావరణంలో నిర్వహించుకోవాలని నగర ప్రజలకు గుంటూరు నగర పాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 28న జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రజలు పాటించాల్సిన మార్గదర్శకాలను మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.

గోవధ, గోవులు మరియు దూడల అక్రమ రవాణాపై నిషేధం అమల్లో ఉందని కమిషనర్ స్పష్టం చేశారు. జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘించి గోవధ లేదా అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై జైలు శిక్షతో పాటు జరిమానా లేదా రెండూ విధించబడతాయని హెచ్చరించారు. మత సామరస్యాన్ని కాపాడుతూ, జంతు సంక్షేమ చట్టాలను గౌరవిస్తూ ప్రజలు పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు.

పండుగ సందర్భంగా పోలీస్, రెవెన్యూ, పశు సంవర్ధక శాఖ, రవాణా శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, నగర పాలక సంస్థల సమన్వయంతో నిఘా కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఐదు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసి నగరంలో గోవధ నిషేధం, జంతు సంక్షేమ చట్టాలపై ప్రజలకు పాంప్లెట్లు, బ్యానర్లు, మైకుల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

ప్రత్యేక బృందాలు నగరంలోని పశువధ కేంద్రాలను నిరంతరం తనిఖీ చేస్తాయని, అక్రమంగా తరలించిన పశువులను గుర్తిస్తే నగర పాలక సంస్థ ప్రత్యేక వాహనాల ద్వారా స్వాధీనం చేసుకుని గో సంరక్షణశాలకు తరలిస్తామని తెలిపారు.

నగర పాలక సంస్థ అనుమతించిన ప్రదేశాల్లో మాత్రమే తాత్కాలిక వధశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఆంధ్ర ముస్లిం కాలేజ్ సమీపంలోని రావుఫ్ నగర్ ప్రాంతం, బి కన్వెన్షన్ సెంటర్ ఎదుట అన్ని సదుపాయాలతో తాత్కాలిక వధశాలలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ కేంద్రాలను మాత్రమే వినియోగించాలని, ఇతర ప్రాంతాల్లో పశువుల వధకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వధశాలల వద్ద పారిశుధ్య నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు నిరంతరం పరిశుభ్రత చర్యలు చేపట్టి జంతు వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో తొలగించి పూడ్చిపెడతారని పేర్కొన్నారు. నగర ప్రజలు సహకరించి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కమిషనర్ కోరారు.

# క్లస్టర్ వారీగా డిజిటల్ మహానాడు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్ ):** మంగళగిరి నియోజకవర్గ పరిధిలో ఈనెల 27 మరియు 28 తేదీలలో నిర్వహించనున్న డిజిటల్ మహానాడు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య తెలిపారు. నియోజకవర్గాన్ని మొత్తం 12 క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్‌కు ప్రత్యేక వేదికలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ప్రతి క్లస్టర్ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు రెండు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

క్లస్టర్-1 మరియు క్లస్టర్-2 సమావేశాలు కుంచనపల్లిలోని శ్రీ శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నిర్వహించబడనున్నాయి. క్లస్టర్-3,4 సమావేశాలు నులకపేటలోని శ్రేయో ఫంక్షన్ హాల్‌లో, క్లస్టర్-5 సమావేశం యర్రబాలెంలోని డిబీఎస్ ఫంక్షన్ హాల్‌లో జరుగనున్నాయి.

అలాగే క్లస్టర్-6 సమావేశం ఎన్ఆర్ఐ జంక్షన్‌లోని లిటిల్ విలేజ్ బ్యాంకెట్ హాల్‌లో, క్లస్టర్-7 సమావేశం పెదవడ్లపూడిలోని వై గార్డెన్స్‌లో, క్లస్టర్-8 సమావేశం మంగళగిరిలోని చిల్లపల్లి నాగేశ్వరరావు కల్యాణమండపంలో నిర్వహించనున్నారు.

క్లస్టర్-9 సమావేశం మంగళగిరిలోని మార్కండేయ కల్యాణమండపంలో, క్లస్టర్-10 సమావేశం పాత మంగళగిరిలోని భావనాఋషి స్వామి కల్యాణమండపంలో, క్లస్టర్-11 సమావేశం దుగ్గిరాలలోని జంపాల కల్యాణమండపంలో, క్లస్టర్-12 సమావేశం ఈమనిలోని బలరాం గార్డెన్స్‌లో జరగనున్నట్లు అబద్దయ్య తెలిపారు. డిజిటల్ మహానాడు కార్యక్రమం ద్వారా పార్టీ భవిష్యత్ కార్యాచరణ, అభివృద్ధి లక్ష్యాలు, కార్యకర్తల భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, వార్డు పరిధిలోని నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నందం అబద్దయ్య కోరారు.

# శేకూరు చానెల్ పునరుద్ధరణ పనులు పరిశీలించిన అధికారులు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** చేబ్రోలు మండలం శేకూరు చానెల్ పునరుద్ధరణ పనులను జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ వెంకట రత్నం, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, జిల్లా భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు వందనం మంగళవారం సంయుక్తంగా పరిశీలించారు. జలధార జల హారతి కార్యక్రమం, ఉపాధి హామీ పథకం క్రింద జరుగుతున్న పనుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు బాగా తక్కువగా ఉన్న గ్రామాల్లో సేకూరు ఒకటి. భూగర్భ జలాలు పెరుగుదలకు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయుటకు అవకాశం ఉన్న మూడు ప్రదేశాలను గుర్తించారు. జలధార జల హారతి కార్యక్రమం, ఉపాధి హామీ పథకం అనుసంధానంతో చేపడుతున్న పనులు వేగవంతంగా జరుగుతున్నాయని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ తెలిపారు. వర్షాకాలం నాటికి జిల్లాలో గుర్తించి చేపడుతున్న చెరువు పనులను పూర్తి చేసి సిద్ధం చేయాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. భూగర్భ జలాలు పెంపుదలకు ప్రజలు భాగస్వామ్యం, సహకారం అవసరమని జిల్లా భూగర్భ జలాల శాఖ ఉప సంచాలకులు వందనం కోరారు.

# బహిరంగ మద్యపానం చేస్తున్న 194 మందిపై కేసులు నమోదు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ తనిఖీలు చేపట్టారు.

ఈ డ్రైవ్‌లో భాగంగా పోలీసులు మొత్తం 187 కేసులు నమోదు చేసి 194 మందిపై చర్యలు తీసుకున్నారు. వీరిలో 41 మందిపై 34 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేయగా, మరో 153 మందిపై పెట్టి కేసులు నమోదు చేశారు.


వల్నరబుల్ ప్రాంతాలు, కాలనీలు, జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, జిల్లా మరియు గ్రామీణ రహదారులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ కనిపించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

ఓపెన్ డ్రింకింగ్ వల్ల శాంతిభద్రతలకు భంగం కలగడంతో పాటు నేరాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున ఇటువంటి చర్యలను అరికట్టడమే ప్రధాన లక్ష్యమని పోలీసులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని, ప్రజలు చట్టాలను గౌరవించి పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టవిరుద్ధమని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు కోరారు.

# రాహు కాల దీప కాంతుల్లో విజయదుర్గమ్మ ఆలయం





**కడప (జర్నలిస్ట్ ఫైల్ ):** అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లే అని నమ్మి కడప విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల దీపాలు వెలిగించి నవగ్రహ పూజ చేయాలని కడప జిల్లా నలు మూలల నుండి భక్తులు విశేషంగా తరలి వచ్చారు . అమ్మకు వేకువ జామున పంచామృత అభిషేకం అనంతరం షోడశోపచార పూజలు నిర్వహించారు. మ 3 నుండి 4.30 వరకు రాహుకాల పూజలు నిర్వహించారు ఈ రాహకాల పూజలు చేసి దీపాలు వెలిగించడం వలన కోరిన కోరికలు వేను వెంటనే నెరువేరుతాయి.

కాబట్టి కడప జిల్లా నుండే కాక రాయలసీమ ప్రాంతాలనుండి భక్తులు విశేషంగా ఈ పూజకు రావడం జరుగుతుంది . ఈ పూజ చేయడం వలన ఎంతో మందికి వివాహప్రాప్తి ఉద్యోగప్రాప్తి సంతాన ప్రాప్తి అలాగే ఎటువంటి అనారోగ్య భాదలు ఉన్నా తొలగిపోతాయి. అందుకే ప్రత్యేకించి శ్రీ విజయ దుర్గమ్మ ఆలయంలో ఈ రాహుకేతు పూజలు చేయడం వల్ల తమ కోరికలు నెరవేరుతాయి అని భక్తుల నమ్మకం అలాగే ఈ నెల 31 వ తేదీ ఆదివారం పౌర్ణమి సందర్భంగా విశేష అభిషేకం చండీహోమం జరుగుతుంది అని ఆలయ వ్యవస్థాపకులు శ్రీ మల్లికార్జున రావు మరియు ఆలయ నిర్వాహకులు శ్రీ దుర్గా ప్రసాద్ తెలియచేసారు.

# మాట నిలబెట్టుకున్న నేత సీఎం చంద్రబాబు

- నాయి బ్రాహ్మణులు రుణపడి ఉంటాం
- విద్యుత్ బిల్లు 200 యూనిట్లు ఉచితంగా అందించడంపై హర్షం
- ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు కార్యాలయంలో సంబరాలు



**గుంటూరు, (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రంలోని నాయి బ్రాహ్మణుల చిరు వ్యాపారాలకు, వారి ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నాయి బ్రాహ్మణులు నిర్వహించే సెలూన్ షాపులకు (కటింగ్ షాపులు) ప్రతి నెలా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడమే కాకుండా, క్షేత్రస్థాయిలో దీనిని విజయవంతంగా అమలు చేస్తుండటంపై ఎమ్మెల్యే నసీర్ ఆదేశాల మేరకు నాయి బ్రాహ్మణులు తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు, నాయిబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కందుకూరి వెంకట్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తూర్పు కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

గతంలో సెలూన్ నిర్వాహకులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో విద్యుత్ బిల్లుల భారం ఒకటని తెలిపారు. ఆధునికత పెరిగేకొద్దీ ఎయిర్ కండీషనర్లు, హెయిర్ డ్రయ్యర్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వాడకం తప్పనిసరి కావడంతో ప్రతి నెలా కరెంట్ బిల్లుల రూపంలో వేలాది రూపాయలు ఖర్చయ్యేవని చెప్పారు చిన్న దుకాణాలు నడుపుకునే పేద, మధ్యతరగతి నాయి బ్రాహ్మణులకు ఈ బిల్లులు కట్టడం మోయలేని భారంగా మారేదన్నారు.

ఈ తరుణంలో ప్రభుత్వం గతంలో ఉన్న 150 యూనిట్ల పరిమితిని 200 యూనిట్లకు పెంచుతూ జీవో జారీ చేయడంతో చిన్న వ్యాపారులకు భారీ ఊరట లభించిందని తెలిపారు. ఒక్కో షాపు నిర్వాహకుడికి ప్రతి నెలా వందలాది రూపాయలు ఆదా అవుతాయని, ఆ మొత్తాన్ని తమ కుటుంబాల అవసరాలకు, పిల్లల చదువులకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఎన్నికల హామీని అక్షరాలా నెరవేర్చిందని, నాయి బ్రాహ్మణుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మాటల్లోనే కాకుండా చేతల్లోనూ చూపించిందని సంతోషం వ్యక్తం చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అనేది కేవలం ఒక పథకం కాదు, మా కులవృత్తిని నమ్ముకుని బతుకుతున్న లక్షలాది కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన కొండంత ధైర్యం" అని చెప్పారు. కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ బీసీ సెల్ ఉపాధ్యక్షులు తూళ్లూరు కాంతి కిరణ్, కొత్తపేట ఆంజనేయస్వామి గుడి డైరెక్టర్ వెదురూరి పవన్. లాలాపేట వెంకటేశ్వర స్వామి గుడి దేవస్థానం డైరెక్టర్ తుళ్లూరు కిరణ్. మల్లాది నాగరాజు. పాత గుంటూరు శివాలయం దేవస్థానం డైరెక్టర్ మల్లాది కాంతారావు. సంఘ నాయకులు. సాంబశివరావు. కృష్ణ. వెంకటేష్. రవి పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## ప్రధానమంత్రి పదవిలో మోదీకి 12 వసంతాలు

### --- పీవీఎన్ మాధవ్ శుభాకాంక్షలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** దేశ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ పదవీ బాధ్యతలు చేపట్టి సోమవారంతో 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు అందజేశారు.

2014 మే 26న నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారని పీవీఎన్ మాధవ్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో గుర్తు చేశారు. గత పన్నెండు సంవత్సరాలుగా మోదీ సారథ్యంలో భారతదేశం అభివృద్ధి, సంక్షేమం, భద్రత మరియు అంతర్జాతీయ ప్రతిష్ఠ వంటి సమస్త రంగాల్లో అభూతపూర్వమైన పురోగతి సాధించిందని ఆయన కొనియాడారు. పేదలు, రైతులు, మహిళలు మరియు యువత సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన విప్లవాత్మక పథకాలు కోట్లాది మంది జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై భారతదేశ గౌరవాన్ని, ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన దార్శనిక నాయకుడిగా మోదీ చరిత్రలో నిలిచిపోతారని మాధవ్ అభిప్రాయపడ్డారు.

దేశ అభివృద్ధి కోసం అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఈ విశేష సందర్భంగా తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపినట్లు పీవీఎన్ మాధవ్ ప్రకటించారు. మోదీ నాయకత్వంలో దేశం మరింత వేగంగా అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని



**విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్) :** : తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల వేతనాలను పెంచాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ క్యాప్టెన్లకు (డ్రైవర్లకు) గత పదేళ్లుగా కేవలం రూ. 8,500 మాత్రమే వేతనంగా చెల్లించడం అన్యాయమన్నారు. కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, యాజమాన్యం వాటా పీఎఫ్‌ను యాజమాన్యమే చెల్లించాలని, ఈఎస్ఐ, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

చట్టప్రకారం చెల్లించాల్సిన వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించే బాధ్యత రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖదేనని పేర్కొన్నారు. తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రభుత్వం నేరుగా నిర్వహించాలని, బఫర్ సిబ్బందిని నియమించాలని కోరారు.

ఏఐఆర్టీడబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి ముజఫర్ అహమ్మద్ మాట్లాడుతూ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు మద్దతు తెలిపారు.

యూనియన్ అధ్యక్షుడు ఎం. బసవరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 500 వాహనాల్లో సుమారు 500 మంది కెప్టెన్లు అరబిందో (ఏఈఎంఎస్) సంస్థ ద్వారా వైద్య ఆరోగ్య శాఖకు సేవలందిస్తున్నారని తెలిపారు. గత పదేళ్లుగా కనీస వేతనాలు అమలు కాలేదన్నారు. వాహనాల మరమ్మతులు వెంటనే చేపట్టాలని, రిపేర్ల ఖర్చులను యాజమాన్యమే ముందుగా చెల్లించాలని కోరారు. డ్రైవర్ల వద్ద అవసరమైన ఇంప్రెస్ క్యాష్ ఉంచాలని, ప్రమాదాలు జరిగినప్పుడు వాహన మరమ్మతుల భారం యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు.

యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్. దేవి ప్రసాద్ మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లకు రూ. 18,500 వేతనం చెల్లించాలని, ప్రతి సంవత్సరం 10 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరారు.

చట్టప్రకారం వీక్లీ ఆఫ్‌లు, పండుగలు, జాతీయ సెలవులు అమలు చేయాలని, విధి నిర్వహణకు అవసరమైన సెల్‌ఫోన్, రీచార్జ్ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రమాదాలు లేదా మరణాలు సంభవించినప్పుడు ఆరోగ్య బీమా, ఇన్సూరెన్స్, ఎక్స్‌గ్రేషియా సౌకర్యాలు కల్పించి కనీసం రూ. 7 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి. సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి గలగల కాదు... కాలుష్యంతో విలవిల : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

- రోడ్లు కంటే ముందు గోదావరి జలాల శుద్ధి జరగాలి
- నదిని మురికిగా ఉంచి భక్తులను స్నానాలు చేయమనడం వంచించడమే
- పారిశ్రామికవేత్తల మాటల్లో నియమాలు... చేతల్లో ఉల్లంఘనలు
- ఆంధ్ర పేపర్ మిల్లు సంస్థ నిబంధనలను ఉల్లంఘించింది
- కనీసం పన్ను బకాయిలు కూడా చెల్లించలేదు
- పర్యావరణ పరిరక్షణలో పారిశ్రామికవేత్తలు బాధ్యతతో ఉండాలి
- రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గోదావరి నది కాలుష్యం, పుష్కరాల సన్నద్ధతపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** 'ఒకప్పుడు గలగలా ప్రవహించిన గోదావరి తల్లి, నేడు పారిశ్రామిక వ్యర్థాల కాలుష్యంతో విలవిలలాడుతోంది. నదిని మురికిగా ఉంచి, భక్తులను పవిత్ర స్నానాలు చేయమనడం ప్రజలను వంచించడమే అవుతుంది. ఇంత కలుషిత నీటిలో స్నానాలు చేస్తే పుణ్యం వస్తుందో లేదో తెలియదు కానీ, జబ్బులు రావడం మాత్రం ఖాయమ'ని ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పుష్కరాల కోసం రోడ్లు, రంగులు వేయడం కంటే ముందు గోదావరి నది కాలుష్యాన్ని తగ్గించాలని అధికారులకి స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గోదావరి నది కాలుష్యం, పుష్కరాల సన్నద్ధతపై జిల్లా అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సమావేశానికి ముందు తూర్పు లంక లాగూన్స్ పరిశీలించారు. అక్కడి నుంచి తిరిగి వస్తూ నల్లా ఛానెల్‌ను మరోసారి పరిశీలించారు. కన్వేయర్ బెల్ట్ మీద మురుగు నీరు శుద్ధి ప్రక్రియ ముందుకు వెళ్లకపోవడం గుర్తించారు. దీనిపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు.

అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "ఒక వైపు పుణ్య నది గోదావరిలో స్నానం చేస్తే పుణ్యం వస్తుందని భక్తులకు చెబుతూ.. మరో వైపు భారీ స్థాయిలో మురుగు నీటిని నేరుగా నదిలోకి వదలడం అత్యంత హాస్యాస్పదం, దారుణం.

స్నానం చేస్తే పుణ్యం వస్తుందో రాదో తెలియదుగానీ... జబ్బులు వచ్చే ప్రమాదం మాత్రం పొంచి ఉంది. రాజమండ్రి నగరం నుంచి ప్రతి రోజూ 75 మిలియన్ లీటర్ల మురుగునీరు వస్తుంటే, అందులో కేవలం 30 మిలియన్ లీటర్లను మాత్రమే శుద్ధి చేస్తున్నారు. మిగిలిన 45 మిలియన్ లీటర్ల మురికినీటిని ఎటువంటి శుద్ధి లేకుండానే నేరుగా గోదావరి నదిలోకి వదిలేస్తున్నారు. గోదావరి తల్లి మన తప్పులన్నింటినీ భరిస్తూ ప్రవహిస్తోంది కాబట్టి సరిపోయింది. కానీ పవిత్రమైన పుష్కర స్నానాలు ఆచరించేందుకు దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులు మురుగు నీటిలో స్నానం చేస్తున్నామనే భావన కలగకూడదు.

**మురుగునీటి శుద్ధికి బడ్జెట్ ఎక్కడ? :** రాబోయే పుష్కరాల కోసం అన్ని రకాల వసతులు, రోడ్లు, ఘాట్‌ల నిర్మాణం, మౌలిక వసతులు కోసం దాదాపు రూ. 8,000 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేసుకున్నారు. భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నాం కానీ, వారు స్నానం చేసే గోదావరి నదిని శుభ్రంగా ఉంచే మురుగునీటి శుద్ధికి మాత్రం పైసా బడ్జెట్ కేటాయించలేదు. రోజూ 45 ఎంఎల్డీ మురుగునీరు నేరుగా నదిలోకి వెళ్తుంటే.. దాన్ని ఆపడానికి బడ్జెట్ పెట్టకుండా, మిగతా వసతులకు రూ. 8,000 కోట్లు ఖర్చు పెడితే ఏం లాభం?

కొన్నేళ్ల క్రితం ఏలూరులో తాగునీరు కలుషితమై, ప్రజలు వింత వ్యాధి బారిన పడి పది మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి ఘటనలను దృష్టిలో పెట్టుకొని అప్రమత్తంగా ఉండాలి. గోదావరి నదిలోకి మురుగు నీరు కలవకుండా నిరోధించేందుకు, అత్యుత్తమ టెక్నాలజీతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి.

**వాళ్లది బాధ్యత లేని నిర్లక్ష్యం :** నిన్న జరిగిన సమావేశంలో పారిశ్రామికవేత్తలు తాము అన్ని నిబంధనలూ కచ్చితంగా పాటిస్తున్నామని చెప్పారు. కానీ ఈ రోజు ఆంధ్ర పేపర్ మిల్లు పరిసరాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి చూస్తే వారు చెప్పిన మాటలకు, అక్కడ ఉన్న పరిస్థితులకు ఎక్కడా పొంతన లేదు. పరిశ్రమ నుంచి వస్తున్న రసాయన వ్యర్థ జలాల కోసం కనీసం ఒక కాంక్రీట్ కెనాల్ కూడా నిర్మించలేదు. విషపు నీటిని నేరుగా వదిలేయడం వల్ల చుట్టుపక్కల భూగర్భజలాలు పూర్తిగా కలుషితమైపోతున్నాయి. ఈ రసాయన మురికి నీరంతా నేరుగా పవిత్ర గోదావరిలో కలవడం వల్ల నదిలో విపరీతంగా గుర్రపుడెక్క పెరిగిపోతోంది. నది పర్యావరణ వ్యవస్థ సర్వనాశనమవుతోంది. ఇన్ని తప్పులు చేస్తూ, తిరిగి మమ్మల్ని ఇబ్బందిపెడుతున్నారు అని ఆ పరిశ్రమ వాళ్లు మాట్లాడుతున్నారు.

**కోట్లు అర్జిస్తున్నా... రూ. 13 కోట్ల టాక్స్ కట్టలేదు :** ఆంధ్రా పేపర్ మిల్లు సంస్థ రూ. 500 కోట్ల భారీ లాభాలు గడిస్తున్నా, ప్రభుత్వానికి కట్టాల్సిన రూ. 13 కోట్ల పన్ను బకాయిలను మాత్రం చెల్లించడం లేదు. క్షేత్రస్థాయిలో ఇన్ని ఉల్లంఘనలకు పాల్పడుతూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నా, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు ఆ యాజమాన్యానికి కనీసం ఒక్క నోటీసు కూడా పంపించలేదు. పన్ను బకాయిలు ఎందుకు కట్టలేదని, కాలుష్యాన్ని ఎందుకు నియంత్రించలేదని ప్రశ్నిస్తే.. తాము 3 వేల మందికి ఉద్యోగాలు ఇస్తున్నామని యాజమాన్యం సాకులు చెప్పడం సరికాదు. ఫ్యాక్టరీ నడపడానికి మన గోదావరి జలాలను వాళ్లు వాడుకుంటున్నారు కనుకే ఉపాధి కల్పిస్తున్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రజలందరి ప్రాథమిక హక్కు. ఉద్యోగాలు ఇస్తున్నామనే సాకుతో ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాసే అధికారం ఎవరికీ లేదు. కాలుష్యంపై గట్టిగా నిలదీస్తే రాష్ట్రం వదిలి వెళ్లిపోతాం అని కొందరు బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారు. ఇలాంటి బెదిరింపులకు మేము లొంగేవాళ్లం కాదు. పారిశ్రామికవేత్తల మీద మాకు తగిన గౌరవం ఉంది. ఉద్యోగాలు ఇస్తున్నారనే మిమ్మల్ని గౌరవిస్తున్నాం. కానీ పర్యావరణాన్ని రక్షించడం మీ ప్రాథమిక బాధ్యత. దయ చేసి ఆ బాధ్యతను గుర్తించి నడుచుకోవాలి.

**రూ. 1368 కోట్లు మంజూరు చేశాం :** గోదావరి పుష్కరాలు జరిగే 6 జిల్లాల్లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఈ రెండేళ్లలో 1849 కిలోమీటర్ల బీటీ రోడ్లు రూ. 1368 కోట్లతో మంజూరు చేశాం. అందులో 229 కిలోమీటర్ల బీటీ రోడ్లు పూర్తయ్యాయి. 190 కిలోమీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. ఇందులో ఇప్పటికే 600 కిలోమీటర్లు సాస్కీ పథకం ద్వారా మంజూరు చేశాం. 2076 కిలోమీటర్ల సీసీ రోడ్లు రూ. 1038 కోట్లతో మంజూరు చేశాం. అందులో 1340 కిలోమీటర్ల రోడ్లు పూర్తయ్యాయి. 684 కిలోమీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. అడవి తల్లి బాట కింద మరో 216 కిలోమీటర్ల బీటీ రోడ్లు రూ. 180 కోట్లతో మంజూరు చేశాం. అందులో 95 కిలోమీటర్ల పనులు పురోగతిలో ఉన్నాయి. 42 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా టైమ్ లైన్ పెట్టుకొని పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను కోరుతున్నాను. ఇవి కాకుండా ఇంకా 1324 కిలోమీటర్ల బీటీ రోడ్లుకు రూ. 989 కోట్లు కావాలని అధికారులు కోరారు. ఇందులో 480 కిలోమీటర్లు బీటీ రోడ్లు ప్రాధాన్యత ఆధారంగా కావాలని కోరారు. వీటిని కూడా ఒకసారి పరిశీలించి ఒక నిర్ణయం తీసుకుంటాం.

**అధికారులతో సమీక్షలో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు :** రాబోయే పవిత్ర గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఆరు జిల్లాల్లో దాదాపు రూ. 8,800 కోట్లు నిధులు అవసరమని అధికారులు అంచనా వేశారు. పుష్కర జిల్లాల పరిధిలో రూ. 1,080 కోట్ల అంచనా వ్యయంతో 1,324 కిలోమీటర్ల మేర రోడ్ల అభివృద్ధికి 889 పనులను ప్రతిపాదించారు. కనెక్టివిటీని పెంచేందుకు రూ. 975 కోట్ల వ్యయంతో 850 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణ పనులను అంచనా వేశారు. జనసందోహం అంతా కేవలం రాజమండ్రి నగరానికే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాలకు వికేంద్రీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. అలాగే పుష్కర్ నగర్ అంచనా నమూనాను తయారు చేయాలని, పుష్కర్ నగరాలతో పాటు పుష్కర్ పంచాయతీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఒక పంచాయతీలో పైలట్ ప్రాజెక్ట్‌గా చేపట్టాలని నిర్ణయించారు. లాడ్జింగ్, బోర్డింగ్, పార్కింగ్, శానిటేషన్ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు సోము వీర్రాజు, శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ దేశంలో కొత్తగా ప్రారంభమైనది కాదని, ఇది స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నిరంతరంగా కొనసాగుతున్న ప్రక్రియేనని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తెలిపారు. దాదాపు 20 సంవత్సరాల అనంతరం ఈ ప్రక్రియ మళ్లీ ప్రారంభమైందన్నారు.

మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న చొరబాటుదారులను గుర్తించడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయడం వంటి అంశాల్లో ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని పేర్కొన్నారు.

ఇటీవల ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకున్నారని, అక్కడ పోలింగ్ శాతం భారీగా పెరగడానికి ఓటర్ల జాబితా శుద్ధి ప్రక్రియే ప్రధాన కారణమని తెలిపారు.

గతంలో పోలింగ్ శాతం తక్కువగా నమోదుకావడానికి ఒకే ఓటరుకు డబుల్ ఎంట్రీలు ఉండటం, వలస వెళ్లిన వారి పేర్లు జాబితాలో కొనసాగడం, మరణించిన వారి వివరాలు తొలగించకపోవడం వంటి లోపాలే కారణమని పేర్కొన్నారు. ప్రస్తుతం జరుగుతున్న డ్రైవ్ ద్వారా అర్హులైన వారిని జాబితాలో కొనసాగిస్తూ, అనర్హుల పేర్లను తొలగిస్తున్నారని తెలిపారు.

ఇతర రాష్ట్రాలు లేదా విదేశాల్లో నివసిస్తున్న వారిని తొలగించే విషయంలో కూడా ఎన్నికల సంఘం తగిన జాగ్రత్తలు తీసుకుంటోందని చెప్పారు. సరైన ఆధారాలు చూపించని సందర్భాల్లో మాత్రమే పేర్ల తొలగింపు జరుగుతుందని స్పష్టం చేశారు.

దేశ ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై అపారమైన విశ్వాసం ఉందని, మరింత పారదర్శకంగా ఎన్నికల వ్యవస్థ ముందుకు సాగేందుకు బాధ్యతాయుత రాజకీయ పార్టీగా బీజేపీ పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.

కొన్ని రాజకీయ పార్టీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే పవిత్రమైన ఈ ప్రక్రియపై విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. అయితే ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నేత ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో 'అప్నాపన్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి లోకేష్



**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు ఉన్న అనుబంధంపై కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రచించిన "అప్నాపన్: మై ఎక్స్‌పీరియెన్సెస్ విత్ నరేంద్ర మోదీ" పుస్తకావిష్కరణ కార్యక్రమంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. ఈ ఉదయం ఢిల్లీలోని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆవరణలో 'అప్నాపన్' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో మాజీ ప్రధాని హెచ్ డీ దేవగౌడ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 'అప్నాపన్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు, బీజేపీ నాయకులు, పలువురు సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

## శ్రీవారి లడ్డూ నెయ్యి కేసులో అధికారులపై చర్యలు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి నెయ్యి సరఫరా చేసిన వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్‌కు అక్రమంగా అనుమతులు, తప్పుడు ధ్రువీకరణలు ఇచ్చిన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు సిద్ధమైంది. ఈ మేరకు కార్మికశాఖ కార్యదర్శి ఎం.వి. శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేసి ఏడు జీవోలను విడుదల చేశారు.

వైష్ణవి డెయిరీకి నెయ్యి తయారీకి అవసరమైన యంత్రాలు, సామర్థ్యం లేవని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. అయినప్పటికీ అన్ని అనుమతులు ఉన్నట్లు ధ్రువీకరించిన ఫ్యాక్టరీస్, బాయిలర్స్, కార్మికశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అర్హతలు లేకపోయినా ఫ్రంట్ కంపెనీగా అక్రమంగా టెండర్లు దక్కించుకుని, నకిలీ పత్రాలతో తిరుమల తిరుపతి దేవస్థానానికి నెయ్యి సరఫరా చేసినట్లు సిట్ విచారణలో తేలినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే డెయిరీ నిర్వాహకులు, యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టులు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో అప్పటి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కర్రి పరమేశ్వరరావు, పదవీ విరమణ చేసిన సూపర్‌వైజర్ బి. రమేష్‌బాబుతో పాటు ప్రస్తుతం సేవల్లో ఉన్న మరో ఐదుగురు అధికారులకు నోటీసులు జారీ చేశారు. విజయవాడ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ మేడిచర్ల సత్యనారాయణ, ఏలూరు బాయిలర్ ఇన్‌స్పెక్టర్ ఎంవీఎల్ నరసింహరాజు, నెల్లూరు బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్ టి. సుష్మ, తిరుపతి బాయిలర్ ఇన్‌స్పెక్టర్ పి. రాంబాబు, నెల్లూరు ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ ఎన్. శివశంకర్ రెడ్డిలపై కూడా క్రమశిక్షణ చర్యలు ప్రారంభించారు.

సరిగా తనిఖీలు నిర్వహించకుండా తప్పుడు ధ్రువీకరణలు ఇచ్చారని, అవినీతికి పాల్పడ్డారని సిట్ అభియోగాలు మోపింది. ఈ మేరకు 470/2024 కేసు కూడా నమోదు చేసినట్లు సమాచారం. సంబంధిత అధికారులు తమ వివరణ సమర్పించేందుకు పది రోజుల గడువు ఇచ్చారు.

## కొత్త డీఎంఈగా డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్

- 15 మంది ఏడీఎంఈలకు పోస్టింగ్‌లు.. నలుగురు కొత్త ప్రిన్సిపాళ్లు, తొమ్మిది మంది సూపరింటెండెంట్లు
- విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ రఘునందన్ నియామకం

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర వైద్య విద్యా శాఖలో కీలక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వైద్య విద్యా సంచాలకుడు (డీఎంఈ)గా కాకినాడ రంగరాయ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్‌ను నియమించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇటీవల అదనపు వైద్య విద్యా సంచాలకులుగా (ఏడీఎంఈలు) పదోన్నతి పొందిన 15 మంది సీనియర్ వైద్యులకు ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లుగా పోస్టింగ్‌లు కేటాయించింది. ఈ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు.

గత తొమ్మిది నెలలుగా ఇన్‌చార్జ్ డీఎంఈగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రఘునందన్‌ను విజయవాడ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించనున్నారు. ప్రస్తుతం రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ విష్ణువర్ధన్‌కు డీఎంఈ బాధ్యతలు అప్పగించనున్నారు.

అనారోగ్య కారణాలతో ఏలూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్. రాజు అభ్యర్థన మేరకు ఆయనను రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీ చేయనున్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో న్యూరాలజీ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ కెవివి సత్యనారాయణ మూర్తిని అదనపు డీఎంఈగా నియమించనున్నారు.

**కొత్త ప్రిన్సిపాళ్ల నియామకాలు :** రంగరాయ వైద్య కళాశాలలో ఫార్మకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ పి. ఉషాకిరణ్‌ను అదే కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించనున్నారు. విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలలో పేథాలజీ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ బసుమిత్ర దాస్‌ను పాడేరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించనున్నారు.

విజయవాడ సిద్ధార్థ వైద్య కళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ ఎస్. గోవిందును పిడుగురాళ్ల వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించనున్నారు. రంగరాయ వైద్య కళాశాలలో బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. శివానిని ఒంగోలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది.


విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కాలేజీలో జనరల్ సర్జరీ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ వి. మన్మధరావును విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) డైరెక్టర్‌గా నియమించనున్నారు.

**కొత్త సూపరింటెండెంట్లు :** పదోన్నతి పొందిన పలువురు వైద్యులను రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వాసుపత్రులకు సూపరింటెండెంట్లుగా నియమించారు. కర్నూలు న్యూరాలజీ ప్రొఫెసర్ డాక్టర్ సి. శ్రీనివాసులు పిడుగురాళ్లకు, విశాఖపట్నం ఎండోక్రైనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కెవివి సూర్యనారాయణ రాజమహేంద్రవరానికి, కర్నూలు అనస్థీషియా ప్రొఫెసర్ డాక్టర్ జి. విశాల నంద్యాలకు పోస్టింగ్ పొందారు.

రాజమహేంద్రవరం జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ పివివి సత్యనారాయణను ఏలూరుకు, విశాఖపట్నం గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి. సౌమినిని శ్రీకాకుళానికి, కర్నూలు ఎండోక్రైనాలజీ ప్రొఫెసర్ డాక్టర్ పి. శ్రీనివాసులను మచిలీపట్నానికి నియమించారు.

కర్నూలు జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ పి. రాజశేఖర్‌ను పాడేరు, తిరుపతి పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ బి. మనోహర్‌ను తిరుపతి రుయా ఆసుపత్రి, విశాఖపట్నం జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ వి. రాజ్‌కమల్‌ను పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు సూపరింటెండెంట్‌గా నియమించారు.

**డాక్టర్ విష్ణువర్ధన్‌కు 29 ఏళ్ల అనుభవం :** 1987లో విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన డాక్టర్ అత్తలూరి విష్ణువర్ధన్, 1994లో మణిపాల్ కస్తూరిబా మెడికల్ కాలేజీలో అనస్థీషియాలో ఎం.డి పూర్తి చేశారు. 1997లో రంగరాయ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి వైద్య రంగంలో 29 ఏళ్ల అనుభవాన్ని సంపాదించారు.



ప్రొఫెసర్, విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపాల్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించిన ఆయన, గత ఏడాది నుంచి రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. కళాశాలలో మౌలిక వసతుల అభివృద్ధికి రూ. 15 కోట్లకు పైగా నిధుల సమీకరణలో కీలక పాత్ర పోషించారు.

ఉత్తమ వైద్య సేవలందించినందుకు 2018, 2021 సంవత్సరాల్లో ఉత్తమ వైద్యుడు అవార్డులు అందుకున్న ఆయన, పరిశోధన రంగంలోనూ విశిష్ట సేవలకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రశంసలు పొందారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467